31వ వసంతంలోకి

# చురకలు

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల

గురువారం 18 డిసెంబర్ 2025 | పేజీలు : 8

## ఎలక్షన్ సరళిని పరిశీలించిన జిల్లా ఎస్పీ



చురకలు ప్రతినిధి, జగిత్యాల, డిసెంబర్ 17 : మూడవ విడత సర్పంచ్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. బుధవారం ఎన్నికలు జరిగిన ఇబ్రహీంనగర్, గొల్లపల్లి, బత్కపల్లి, సంచర్ల, గ్రామాల్లో గల పోలింగ్ కేంద్రాలను ఎస్పీ సందర్శించారు. ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. జిల్లాలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పెట్రోలింగ్ వాహనాలు మరియు ప్రత్యేక పోలీసు బృందాలు నిరంతరం పర్యటిస్తూ శాంతిభద్రతలను పర్యవేక్షిస్తారని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వహిస్తున్న అధికారుల కు, సిబ్బందికి ఎస్పీ భద్రత పరమైన పలు సూచనలు చేశారు.

# పైడిపల్లిలో తీవ్ర ఉద్రిక్తత





- పోలీసుల లాఠీచార్జ్ గాల్లోకి కాల్పులు
- పోలీసులపై రాళ్లు రువ్విన గ్రామస్తులు
- ఫలితాలు తారుమారు చేశారని ఆందోళన
- బ్యాలెట్ బాక్స్ లు బయటకు రాకుండా అడ్డగింపు
- రీ కౌంటింగ్ చేయాలని డిమాండ్

చురకలు విలేఖరి
వెల్గటూర్, డిసెంబర్, 17:

మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఫలితాలు తారుమారు చేశారని గ్రామస్తులు ఆందోళనకు దిగడం వారిపై పోలీసులు లాఠీచార్జి చేసి గాల్లోకి కాల్పులు జరపడంతో జగిత్యాల జిల్లా వెల్గటూరు మండలం పైడిపల్లిలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.

కొందరు పెద్ద తలకాయల జోక్యంతో చివరి నిమిషంలో సర్పంచ్ ఫలితాన్ని తారు మారు చేశారని ఆరోపిస్తూ ఓ అభ్యర్థికి మద్దతుగా గ్రామస్తులు, యువత పోలింగ్ సిబ్బందితో ఘర్షణకు దిగారు. ఈ ఘర్షణ కాస్త ఉగ్ర రూపం దాల్చి బ్యాలెట్ బాక్స్ లు బయటకు రాకుండా పోలింగ్ కేంద్రం ముందు వందలాది మంది బైటాయించి నిరసనకు దిగారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి గ్రామస్తులను చదరగొట్టేందుకు తీవ్రంగా ప్రయత్నించిన గ్రామస్తులు శాంతించకుం డా రీ కౌంటింగ్ చేయాలని డిమాండ్ చేస్తూ పోలింగ్ కేంద్రం ఎదుట బైఠాయించారు.

చివరకు పోలీసులు లాటిచార్జ్ చేసి గాల్లోకి కాల్పులు జరిపి గ్రామస్థులను చెదరగొట్టగా గ్రామస్తులు పోలీసులపై రాళ్లు రువ్వారు. పోలీసు వాహనాలను ధ్వంసం చేశారు. ఈ గొడవలో ఓ పోలీసు కు గాయమైనట్లు సమాచారం.

చివరకు కొంతమంది యువకులను పోలీసులు అదుపులోకి తీసుకొని బ్యాలెట్ బాక్స్ లను పోలింగ్ కేంద్రం నుండి తరలించారు. ప్రస్తుతం గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొనే ఉంది. జగిత్యాల జిల్లా కేంద్రం నుండి పెద్ద ఎత్తున పోలీస్ బలగాలను పైడిపల్లిలో మోహరించారు.

## జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

- జిల్లాలో పోలింగ్ శాతం 79.64 నమోదు



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, డిసెంబర్ 17 :** గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మూడవ విడత ఎన్నికల పోలింగ్ 79.64 శాతం నమోదైంది. బుగ్గారం,ధర్మపురి, ఎండపెల్లి, గొల్లపెల్లి, పెగడ పెల్లి, వెల్గటూర్ మండలాల్లో బుధవారం పోలింగ్ నిర్వహించారు. 6 మండలాల్లో కలిపి మొత్తం 1,71,920 ఓట్లు ఉండగా,1,36, 917 ఓట్లు పోల్ కాగా, 79.64 శాతం పోలింగ్ నమోదైంది. బుగ్గారం మండలంలో మొత్తం ఓటర్లు 17,347 మంది ఉండగా, 13,496 మంది ఓటు హక్కు వినియోగించుకోగా. 77.8 శాతం నమోదైంది. ధర్మపురి మండలంలో మొత్తం ఓటర్లు 34,636మంది ఉండగా, 25,302 మంది ఓటు హక్కు వినియోగించుకోగా. 73.05 శాతం నమోదైంది. ఎండపెల్లి మండలంలో మొత్తం ఓటర్లు 22,825 మంది ఉండగా, 19,110 మంది ఓటు హక్కు వినియోగించుకోగా, 83.72 శాతం నమోదైంది. గొల్లపెల్లి మండలంలో మొత్తం ఓటర్లు 39,658 మంది ఉండగా, 32,065 మంది ఓటు హక్కు వినియోగించుకోగా, 80.85 శాతం నమోదైంది. పెగడపెల్లి మండలంలో మొత్తం ఓటర్లు 34,768 మంది ఉండగా 27,855 మంది ఓటు హక్కు వినియోగించుకోగా, 80.12 శాతం నమోదైంది. వెల్లటూర్ మండలంలో మొత్తం ఓటర్లు 22,684 మంది ఉండగా, 19,089 మంది ఓటు హక్కు వినియోగించుకోగా, 84.15 శాతం నమోదైంది.

## మూడవ విడత పంచాయతీ ఎన్నికలు ప్రశాంతం

- కలెక్టర్ కోయ శ్రీ హర్ష
- మూడవ విడత పోలింగ్ 85.66 శాతం నమోదు
- ఓదెల మండలం కొలనూరు జెడ్పీహెచ్ఎస్, పెద్దపల్లి మండలం పెద్ద కాల్వల ఎంపీపీఎస్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ (పెద్దపల్లి, ఓదెల) డిసెంబర్ 17 :** జిల్లాలో నిర్వహించిన మూడవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షలి తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మూడవ విడత పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఓదెల మండలం కొలనూరు జెడ్పీహెచ్ఎస్, పెద్దపల్లి మండలం పెద్ద కల్వల మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందరరేగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూలి మూడవ విడత 85 గ్రామ పంచాయతీలకు, 636 వార్డులకు నిర్వహించిన పోలింగ్ లో 85.66 % మంది తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారని అన్నారు. ఉదయం 9 గంటల వరకు 22.50%, 11 గంటలకు 57.21%, 1 గంట వరకు 82.34% పోలింగ్ నమోదైందని,ఒంటి గంట వరకు పోలింగ్ కేంద్రాలకు చేరు కున్న ఓటర్లకు టోకెన్

2లో

## మూడవ విడత

## పంచాయతీ ఎన్నికలు ప్రశాంతం

**మొదటి పేజీ తరువాయి...**అందించి ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించామని,వారితో కలిపి మొత్తం పెద్దపల్లి జిల్లాలో మూడవ విడత 85.66% పోలింగ్ నమోదైందని అన్నారు.మూడవ విడత పోలింగ్ నిర్వహించిన పెద్దపల్లి మండలంలో 86.39%, సుల్తానాబాద్ మండలంలో 86.51 శాతం, ఎలిగేడు మండలంలో 83.73%, ఓదెల మండలంలో 84.70% పోలింగ్ నమోదైందని, మొత్తం లక్షా 42 వేల 548 మంది ఓటర్లకు గాను లక్షా 22 వేల 111 మంది ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారని కలెక్టర్ పేర్కొన్నారు.అంతకుముందు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పంచాయతీ ఎన్నికల మూడవ విడత పోలింగ్ సందరరేగా ఓదెల మండలం కొలనూరు జడ్పీహెచ్ఎస్, పెద్దపల్లి మండలం పెద్ద కల్వల మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంట ఏసీపీ గజ్జి కృష్ణ ఆర్వో లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచును సన్మానించిన

## కాంగ్రెస్ నాయకులు



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ డిసెంబర్ 17 :** కమాన్ పూర్ గ్రామ సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్ ను మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్ కమాన్ పూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సయ్యద్ అన్వర్ లు సన్మానించారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేసిన కమాన్ పూర్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులకు శుభాకాంక్షలు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్ తెలియజేశారు.కమాన్ పూర్ సర్పంచ్ గా విజయం సాధించిన రంగు సత్యనారాయణ గౌడ్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్ ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. అనంతరం విజయం సాధించిన రంగు సత్యనారాయణ గౌడ్ శాలువాతో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తిరుపతి యాదవ్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఎస్ ఎస్ అన్వర్ సన్మానించారు.వారితో పాటు కమాన్ పూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఎస్ ఎస్ అన్వర్, రామగిరి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రొడ్డ బాపన్న తో పాటు ఆ రెల్లి కొమురయ్య గౌడ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సయ్యద్ ఇక్బాల్, అబ్దుల్ రఫీక్, మల్యాల మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా అధ్యక్షుని గ్రామంలో

## బిజెపికి ఘోర పరాభవం

**-గంగాడి కృష్ణారెడ్డి సొంత గ్రామం నర్సింగాపూర్‌లో..మూడో స్థానానికి పరిమితమైన బిజెపి**

**(కోరెం సుధాకర్ రెడ్డి చురకలు ప్రతినిధి హుజురాబాద్)**



మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికలు జరిగినా వీణవంక మండలం లోని నర్సింగాపూర్ గ్రామంలో బి ఆర్ ఎస్ అభ్యర్థి రమేష్ గెలుపొందగా కాంగ్రెస్ రెండో స్థానంలో బిజెపి బలపరిచిన అభ్యర్థి మూడో స్థానానికి పరిమితం అయ్యాడు. నర్సింగాపూర్ బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి సొంత గ్రామం కావడం విశేషం. అయితే హుజూరాబాద్ నియోజకవర్గం లో ఈటెల రాజేందర్, బండి సంజయ్ వర్గాలుగా బిజెపి పనిచేస్తోంది.అయితే గంగాడి కృష్ణారెడ్డి ఈటల రాజేందర్ వ్యతిరేకవర్గమైన బండి సంజయ్ వర్గంలో ఉన్నట్టు కార్యకర్తలు చెప్తుంటారు. కానీ కేంద్ర మంత్రి బండి సంజయ్ ముఖ్య అనుచరుడిగా ఉన్న గంగాడి సొంత గ్రామంలో బిజెపి దయనీయ పరిస్థితికి చేరుకోవడం కార్యకర్తలు జీర్ణించుకోలేక పోతున్నారు.ఇది ఆయనకు సొంత గ్రామంలో ఏ మాత్రం పట్టు పార్టీపై ఉందో తెలియజేస్తుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.ఇంట గెలిచి రచ్చ గెలవాలి అన్న నానుడిని కార్యకర్తలు గుర్తు చేస్తున్నారు.బిజెపిలో ఐక్యత దెబ్బ తినడానికి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి వైఖరి కూడా కారణమని విమర్శలు వస్తున్నాయి. జిల్లా అధ్యక్షునిగా తటస్థంగా ఉండాల్సిన గంగాడి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని పలువురు కార్యకర్తలు బహిరంగంగా చెబుతున్నారు.

# చాలా ఏళ్లకు.."చెయ్యెత్తి" జై కొట్టిన హుజురాబాద్ మండల ఓటర్లు

**-హుజురాబాద్ మండలం లో కాంగ్రెస్ దే పై "చేయి"**
**-కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థుల గెలుపుతో కాంగ్రెస్‌లో ఉత్సాహం**
**-పంచాయతీ పోరులో "ప్రణవ్" సక్సెస్**

**(కోరెం సుధాకర్ రెడ్డి, చురకలు ప్రతినిధి, హుజురాబాద్)**

హుజురాబాద్ నియోజకవర్గంలో అందునా హుజురాబాద్ మండలంలో స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు ఆధిక్యాన్ని ప్రదర్శించలేదు. పాత కమలాపూర్ నియోజకవర్గంలో అప్పడి టిడిపి ఎమ్మెల్యే ముద్దసాని దామోదర్ రెడ్డి హవా ఉండేది. అయన కాంగ్రెస్ పార్టీని తీవ్రంగా అణచివేసే ప్రయత్నం చేశారన్న విమర్శ ఉంది. మాదాడి రాంచంద్రారెడ్డి, లింగంపల్లి వీరారెడ్డి, కేతిరి సాయిరెడ్డి వంటి కాంగ్రెస్ దిగ్గజాలు దామోదర్ రెడ్డిని నాడు తట్టుకోలేక పోయారు. హుజురాబాద్ లో మాత్రం బి ఆర్ ఎస్ పార్టీ ఆవిర్భావం కంటే ముందు నాడు కెప్టెన్ లక్ష్మీకాంతరావు కాంగ్రెస్ లో ఉన్నప్పుడు స్థానిక ఎన్నికల్లో పలు స్థానాలు ఆ పార్టీ గెలుచుకుంది. కానీ బి ఆర్ ఎస్ ఆవిర్భావం అనంతరం కాంగ్రెస్ పార్టీ స్థానికంగా బలహీన పడిపోయింది. ఇటు హుజురాబాద్ లో కెప్టెన్, అటు కమలాపూర్ లో ఈటల నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ గడ్డు పరిస్థితి ఎదుర్కొంది. స్థానిక ఎన్నికల్లో మెజారిటీ స్థానాలు గులాబీ పార్టీ గెలుచుకునేది. మొన్నటి మొదటి విడత ఎన్నికలు కమలాపూర్ మండలంలో జరగ్గా బి ఆర్ ఎస్ ఆధిపత్యం ప్రదర్శించింది. ఐతే సుమారు 25 ఏళ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీ హుజురాబాద్ మండలంలో తన ప్రభావాన్ని చూపింది. దీంతో ఆ పార్టీలో ఉత్సాహం మిన్నంటింది.

**బలం ప్రదర్శించిన యువనేత "ప్రణవ్"**

కాంగ్రెస్ పార్టీకి ప్రాతినిధ్యం వహిస్తున్న యువనేత వొడితల ప్రణవ్ హుజురాబాద్ మండలంలో గ్రామపంచాయతీ ఎన్నికల్లో అన్ని తానై నడిపించారు. అయన కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులను ఎంపిక చేయడంతో పాటు ఆయా గ్రామాల్లో వారి ప్రచారంలో పాల్గొన్నారు. వారిని నిరుత్సాహ పడకుండా ప్రోత్సహించారు. కాంగ్రెస్ అభ్యర్థిగా హుజురాబాద్ నియోజకవర్గం నుండి 2023 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన ప్రణవ్ 53,164 ఓట్లు తెచ్చుకున్నారు. ఆ ఎన్నికల్లో ఓటమి చెందినప్పటికీ నిరుత్సాహ పడకుండా నియోజకవర్గంలో ఎప్పటికప్పుడు పర్యటిస్తూ.. అధికార పార్టీ తరపున హుజురాబాద్ నియోజకవర్గంలో పార్టీ బలాన్ని పెంచడంతో పాటు తన ఆధిపత్యాన్ని ప్రదర్శించే ప్రయత్నం చేస్తున్నారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబులతో నిత్యం టచ్ లో ఉంటూ కార్యకర్తల, తన వద్దకు వచ్చే వారి పనులు చేయించే ప్రయత్నం చేస్తున్నారు. సి ఎం రిలీఫ్ ఫండ్, ఇందిరమ్మ ఇళ్ళు వంటి పనులు కాంగ్రెస్ లబ్దిదారులకు వచ్చేలా చొరవ చూపిస్తున్నారు. ఇక్కడ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి నాయకత్వంలో బలంగా ఉన్న బి ఆర్ ఎస్ ను ఎదుర్కొనే క్రమంలో ప్రణవ్ మొదటిసారి హుజురాబాద్ మండలంలో సక్సెస్ అయ్యారనే టాక్ వినిపిస్తోంది. హుజురాబాద్ కాంగ్రెస్ నేతలు ప్రణవ్ కు అభినందనలు తెలుపుతున్నారు. మండలంలో 20 గ్రామాలుండగా 6 చోట్ల బి ఆర్ ఎస్, 8 చోట్ల కాంగ్రెస్, మూడు చోట్ల బీజేపీ, మూడు చోట్ల ఇండిపెండెంట్లు గెలిచారు. ఇండిపెండెంట్లు అధికార కాంగ్రెస్ పార్టీ వైపు మొగ్గు చూపుతారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కాంగ్రెస్ పార్టీ హుజురాబాద్ మండలం మెజారిటీ స్థానాలు కైవసం చేసుకోవడం స్థానిక రాజకీయాల్లో చర్చనీయాంశం అయింది.

**బీజేపీకి దెబ్బ పడింది**

మూడో విడత పంచాయతీ ఎన్నికలు హుజురాబాద్ నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో జరిగాయి. ఇందులో బలం ప్రదర్శించాలని, రాబోయే కాలంలో తన స్థానాన్ని సుస్థిరం చేసుకోవాలని మల్కాజిగిరి ఎంపీ రాజేందర్ భావించారు. అయన ఇక్కడ అభ్యర్థులను నిలిపి ప్రచారం చేసినప్పటికీ ఆశించిన ఫలితం దక్కలేదు. కేవలం మూడు చోట్ల బీజేపీ అభ్యర్థులు స్థానిక మండలంలో గెలుపొందినట్లు తెలుస్తోంది.

**విజేతలు ఎవరంటే..**

హుజురాబాద్ మండలంలో సర్పంచ్ ఎన్నికల్లో గెలిచినా అభ్యర్థుల వివరాలు ఇలా ఉన్నాయి. రాజపల్లి - కట్కూరి మల్లారెడ్డి (బి ఆర్ ఎస్), రంగాపురం - కుంట అరుణ తిరుపతి రెడ్డి ( బి ఆర్ ఎస్), ధర్మరాజుపల్లి - కందాల శ్రీలత (బి ఆర్ ఎస్), జూపాక - తాళ్లపల్లి స్వప్న వెంకటేష్ (బి ఆర్ ఎస్), పెద్ద పాపయ్య పల్లి - కత్తుల రాజు (బీ ఆర్ ఎస్), సిర్సపల్లి - పోల్సాని రామారావు (బి ఆర్ ఎస్), వెంకట్రావుపల్లి - పత్తి అనిత (కాంగ్రెస్), మాందాడిపల్లి వేల్పుల మాధవి కుమార్ (కాంగ్రెస్), అంబేద్కర్ నగర్ - ఇమ్మడి దయాకర్ (కాంగ్రెస్), తుమ్మనపల్లి - అన్నాడి మాధవి రవీందర్ రెడ్డి (కాంగ్రెస్), కాట్రపల్లి - పెరుమాళ్ళ హైమ (కాంగ్రెస్), చెల్పూర్ - వంతడుపుల కస్తూరి (కాంగ్రెస్), సింగాపురం - కల్వల సంపత్ ( కాంగ్రెస్), రాంపూర్ - ముశం సంగీత గణేష్ ( కాంగ్రెస్), , పోతిరెడ్డిపేట - మంతెనసుమలత (బిజెపి), కందుగుల - ముప్పు మహేష్ (బీజేపీ), బొత్తలపల్లి - బాషబోయిన శ్రీనివాస్ (బిజెపి), చిన్నపాపయ్యపల్లి - చల్లూరి చిరంజీవి (ఇండిపెండెంట్), కనుకులగిద్ద - మొలుగు సంధ్యారాణి సంపత్ (ఇండిపెండెంట్), శాలపల్లి - కోడిగూటి ప్రవీణ్ (ఇండిపెండెంట్) విజయం సాధించారు.

# గ్రామాభివృద్ధికి కృషి చేస్తా

## చింతలపల్లి సర్పంచ్ చింతల లావణ్య శ్రీనివాస్



**చురకలు ప్రతినిధి, హుజురాబాద్, డిసెంబర్ 17 :** శంకరపట్నం మండలం చింతలపల్లి గ్రామ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని కొత్తగా ఎన్నికైన సర్పంచ్ చింతల లావణ్య శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. తనను భారీ మెజారిటీతో గెలిపించిన ప్రజలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఎంతో నమ్మకంతో ప్రజలు గెలిపించారని, వారి ఋణం తీర్చుకోలేనిది అన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రజల సమస్యల పరిష్కారం కోసం అందుబాటులో ఉంటూ కృషి చేస్తానని అన్నారు. తనకు మద్దతు ప్రకటించిన మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ కు, బి ఆర్ ఎస్ నేతలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కాగా కొత్త సర్పంచ్ చింతల లావణ్యను మాజీ సర్పంచులు పల్లె సంజీవ రెడ్డి, నిమ్మశెట్టి శ్యామ్, రాజేశ్వరి, రాజయ్య, మోరే బాపురావు, పల్లె సదాశివ రెడ్డి, చింతల రాజయ్య, వరాల రమేష్, నిమ్మశెట్టి వీరయ్య తదితరులు అభినందించారు.

**చింతలపల్లి ప్రజలకు కృతజ్ఞతలు: మాజీ సర్పంచి పల్లె సంజీవ రెడ్డి**

చింతలపల్లిలో బి ఆర్ ఎస్ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థి చింతల లావణ్య శ్రీనివాస్ గెలుపు హర్షణీయమని మాజీ సర్పంచ్, బి ఆర్ ఎస్ సీనియర్ నేత పల్లె సంజీవ రెడ్డి అన్నారు. లావణ్య గెలుపు గ్రామంలో బి ఆర్ ఎస్ బలాన్ని చూపించిందని, అలాగే శంకరపట్నం మండలంలో సర్పంచ్ ఎన్నికల్లో బి ఆర్ ఎస్ బలం మరింత పెరిగిందన్నారు. గ్రామాభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా ప్రజలు కలిసిరావాలని అయన కోరారు.

# సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గట్టిగా బుద్ధి

## తూప్రాన్ మండల సర్పంచ్‌లోతో హరీష్ రావు

**సిద్దిపేట,డిసెంబర్17(చురకలు):** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు దిమ్మతిరిగే ఫలితాలు వచ్చాయని.. రేవంత్ రెడ్డికి మైండ్ బ్లాక్ అయిందని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. పల్లె ప్రకృతి వనాలు, డంపు యార్డులు అన్నీ మూలకు పడ్డాయని తెలిపారు. అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని.. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పారని అన్నారు.బుధవారం నాడు గజ్వేల్ నియోజకవర్గం తూప్రాన్ మండలనికి చెందిన పలువురు సర్పంచ్‌లను హరీష్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి దిమ్మతిరిగే ఫలితాలు వచ్చాయని... ప్రజల తీర్పు చూసి కాంగ్రెస్ నాయకులకు షాక్ తగిలిందన్నారు. మొదటి దఫా ఫలితాలు చూసి షాక్ అయ్యారని.. రెండో దఫా ఫలితాలు చూసి మైండ్ బ్లాక్ అయ్యిందంటూ కామెంట్స్ చేశారు. ఇక ఈ రాత్రి వచ్చే మూడో దశ ఫలితాలు కూడా కాంగ్రెస్ పార్టీనీ నిరాశపరచక తప్పదని అన్నారు. ఈ ఓటమి భయంతోనే ఇప్పుడు డబ్బు సంచులు పట్టుకొని హైదరాబాద్ నుంచి బయలుదేరారని తెలిపారు. పోలీసులను అడ్డుపెట్టుకొని అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. నాడు ఢిల్లీలో అవార్డులు ఇస్తే తెలంగాణ పల్లెల పేర్లు లేకుండా జాబితా ఉండేది కాదని.. కానీ రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్లలో తెలంగాణకు ఒక్క అవార్డు కూడా రాలేదని అన్నారు. పల్లెలు అపరిశుభ్రంగా మారాయని... కనీసం కేసీఆర్ కొనిచ్చిన ట్రాక్టర్లలో డీజిల్ పోసే పరిస్థితి కూడా ఈ ప్రభుత్వానికి లేదని దుయ్యబట్టారు. నాడు కేసీఆర్ ప్రతి నెలా పల్లెలకు నిధులు విడుదల చేసేవారని.. కానీ రేవంత్ రెడ్డి వచ్చాక రాష్ట్ర ప్రభుత్వ నిధులు, కేంద్ర ప్రభుత్వ నిధులు బంద్ అయ్యాయన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తల జోలికి వస్తే సహించేది లేదని కాంగ్రెస్ నాయకులను మాజీ మంత్రి హెచ్చరించారు. దాడులు మానుకోకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయన్నారు.బిఆర్ఎస్‌లో గెలిచిన వారిని బలవంతంగా పార్టీలో చేర్చుకోవాలని చూసినా కుదరదన్నారు. ఎందుకంటే బీఆర్ఎస్ కార్యకర్తలు ఉద్యమకారులని గుర్తుంచుకోవాలని..వారు బెదిరింపులకు లొంగరని స్పష్టం చేశారు. దేశం వన్ నేషన్ వన్ ఎలక్షన్ దిశగా వెళ్తోందని.. బహుశా మరో ఆరు నెలల్లోనో ఏడాదిలోనో ఎన్నికలు రావచ్చని చెప్పుకొచ్చారు. రెండేళ్లలో కచ్చితంగా మళ్ళీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే అని... మళ్ళీ సీఎం అవుతారని ధీమా వ్యక్తం చేశారు.

# పదవి కాదు... ప్రజల విశ్వాసమే నిజమైన అధికారం

**-సర్పంచ్ పదవి అధికారం కాదు.. సేవకు ఇచ్చిన అవకాశం**



**(కాలగిరి శ్రీనివాస్ రెడ్డి సీనియర్ జర్నలిస్ట్)**

తెలంగాణ రాష్ట్రంలో సర్పంచ్ ఎన్నికలు ముగిశాయి.ప్రజాస్వామ్య పండుగలో భాగంగా గ్రామాలు తమ భవిష్యత్తును తామే నిర్ణయించుకున్నాయి .నూతనంగా సర్పంచులుగా ఎన్నికైన వారందరికీ శుభాభివందనాలు.ఇది కేవలం ఒక పదవి కాదు గ్రామ ప్రజలు మీపై పెట్టిన అపారమైన నమ్మకానికి గుర్తు.ఈ ఎన్నికల్లో ఒక స్పష్టమైన సందేశం వినిపించింది. కులాలకు, మతాలకు అతీతంగా చాలా పంచాయితీల్లో యువతకు ప్రజలు పట్టం కట్టారు.అవినీతి, ఆశ్రిత పక్షపాతం, అక్రమాలు, ఆక్రమణలు, అన్యాయాలు, అహంకారం, దురహంకారం.. ఇలాంటి రాజకీయ దోషాలను ప్రజలు ఇక సహించబోరని ఓటర్లు చాటిచెప్పారు. గతంలో పదవులు చేపట్టి ప్రజలను మరిచిపోయినవారికి, ఫక్తు రాజకీయాలతో గ్రామాలను విసిగించినవారికి ఓటర్లు గట్టి గుణపాఠం చెప్పారు. ఓటు వేసేదాకా దండాలు, మొక్కులు ఆ తరువాత 'తొండ బలిసి ఊసరవెల్లి అయింది' అన్న చందంగా నిర్లక్ష్యం, నిర్భీతి, నిలువెల్లా అహంకారం ప్రదర్శించడాన్ని ప్రజలు తిరస్కరించారు. ఇది యాదృచ్ఛికం కాదు ప్రజల ఆగ్రహానికి వచ్చిన స్పష్టమైన తీర్పు.అందుకే ఈసారి గ్రామాలు కొత్త దారిని ఎంచుకున్నాయి. ఆశలు, ఆకాంక్షలు, మార్పు కోరికలతో యువకులను ముందుకు తెచ్చాయి. ఇది యువతకు దక్కిన గౌరవం మాత్రమే కాదు ఒక పెద్ద బాధ్యత కూడా.ఇప్పుడు అసలైన పరీక్ష మొదలవుతోంది. పదవి చేపట్టగానే అహంకారం, అధికార దర్పం చూపించే ప్రలోభానికి దూరంగా ఉండాలి. సర్పంచ్ పదవి అధికారం కాదు.. సేవకు ఇచ్చిన అవకాశం. మీరు గెలిచింది మీ వ్యక్తిగత గొప్పతనానికి కాదు గ్రామ ప్రజల ఆశలకు ప్రతినిధిగా నిలబడతారనే నమ్మకానికి.గ్రామంలో ప్రతి సమస్య మీ సమస్యగా మారాలి. నీరు, రహదారులు, పారిశుధ్యం, పాఠశాలలు, ఉపాధి ఇవన్నీ ఫైళ్లలో కాదు, ప్రజల జీవితాల్లో మార్పు తేవాలి. "నన్ను ఎందుకు గెలిపించారు?" అనే ప్రశ్నను ప్రతిరోజూ మీలో మీరే అడగాలి. ఆ ప్రశ్నకు సమాధానమే మీ పాలనకు దిక్సూచి.అహంకారం రాజకీయ జీవితానికి శత్రువు. ప్రజలను తక్కువగా చూసిన నాయకులను చరిత్ర ఎప్పుడూ క్షమించలేదు. అవసరమైన సమయంలో ప్రజలు సరైన తీర్పు చెప్పడం ఖాయం. కాబట్టి కన్ను మిన్ను గానక అధికార ప్రదర్శన చేయడం కాదు చెయ్యి చాచితే వెంటనే స్పందించే సేవా భావమే నాయకత్వ లక్షణం.గ్రామాన్ని "నా గ్రామం"గా కాదు "మన గ్రామం"గా చూడగలిగిన రోజే నిజమైన సర్పంచ్‌గా మీరు నిలుస్తారు. పదవి అయిదేళ్లది మాత్రమే కావచ్చు కానీ మంచి పేరు తరతరాలకు నిలుస్తుంది.

**నూతన సర్పంచులారా..**
**మీ విజయం ఆశల ఆరంభం.**
**మీ పాలన విశ్వాసానికి నిదర్శనం కావాలి.**
**అహంకారాన్ని వదిలి, బాధ్యతను ఒడిసిపట్టి, గ్రామాభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగితే**
**మీరు గెలిచినది ఎన్నికలో మాత్రమే కాదు... ప్రజల హృదయాల్లో కూడా.**
**బెస్ట్ ఆఫ్ లక్.**

# బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్‌పై ఫిర్యాదు

**చురకలు ప్రతినిధి కోరుట్ల, డిసెంబర్ 17 :** బీహార్ రాష్ట్ర ముఖ్య మంత్రి నితీష్ కుమార్ ఒక ముస్లిం మహిళ బుర్ఖా నఖాబ్‌ను బలవంతంగా తొలగించిన ఘటనను తీవ్రంగా ఖండిస్తూ, కోరుట్ల పట్టణ జమాతే ఇస్లామీ హింద్ లేడీస్ వింగ్ ఆధ్వర్యం లో ముస్లిం మహిళలు,అలాగే సర్వమతా లకు చెందిన మహిళలు కలిసి కోరుట్ల ఆర్డీఓ కార్యాలయంలో ఫిర్యాదు పత్రాన్ని సమర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అత్యంత బాధ్యతాయు తమైన హోదాలో ఉన్న ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి మహిళపై చేయి వేయడం , ఆమె దుస్తులను అవమానకరంగా తొలగించడం మహిళా హక్కులకు, మానవ గౌరవానికి విరుద్ధమని పేర్కొన్నారు.ఒక కార్యక్రమంలో బుర్ఖా ధరించిన మహిళ స్కార్ఫ్‌ను స్వయంగా తొలగిస్తున్న ఫోటోలు సోషల్ మీడియా లో వైరల్ కావడం దేశ ప్రతిష్ఠకు భంగం కలిగించిందని వారు అన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డా. భీమ్‌రావ్ అంబేద్కర్ సర్వమతాలకు సమానంగా జీవించే హక్కును కల్పించారని,అలాంటి రాజ్యాంగ విలువలకు విరుద్ధంగా ఒక ముఖ్య మంత్రి వ్యవహరించడం అత్యంత దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. ముస్లిం మహిళ బుర్ఖా నఖాబ్‌ను బలవంతంగా తొలగించడం ద్వారా ఆమె మౌలిక హక్కులను కాలరాసినట్టేనని ఆరోపించారు.ఈ



ఘటనకు బాధ్యుడైన బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని,ఆయన్ను ముఖ్యమంత్రి పదవి నుంచి తొలగించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. ఈ మేరకు కోరుట్ల ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ జీవకర్ రెడ్డి కి వినతిపత్రాన్ని అందజేశారు.భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని, ఈ విషయాన్ని భారత రాష్ట్రపతి, భారత ప్రధాని నరేంద్ర మోదీ దృష్టికి తీసుకెళ్లాలని వారు కోరారు.

# రాఘవపేట్‌లో అయ్యప్ప పడిపూజ

**-స్వామివారికి పంచామృత అభిషేకాలు**
**-భజన సంకీర్తనలు, వేటతుల్లి ఆట ఆడిన అయ్యప్పలు**



**చురకలు ప్రతినిధి జగిత్యాల, డిసెంబర్ 17 :** జగిత్యాల జిల్లా మల్లపూర్  మండలంలోని రఘవపేట్ గ్రామంలో మేకర్తి వెంకటేష్, మెకర్తి హరి రోచన్ కన్నెస్వామి ల స్వగృహంలో బుధవారం వేద అర్చకులు నారంబట్ల భరద్వజ శర్మ  ల కరకమములచే గణపతి ,సుబ్రహ్మణ్యం కలిశ, గంట, అయ్యప్ప స్వామి అభిషేకాలు ,అయ్యప్ప స్వామి అష్టోత్తర, స్వామి వారి 18 మెట్ల పూజ కార్యక్రమం,అయ్యప్ప స్వామికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు.భక్తులు అయ్యప్ప స్వామి దీక్ష పరులు భజన సంకీర్తనలు అలరించాయి.పూజా కార్యక్రమం అనంతరం స్వామివారికి ఎంతో ఇష్టమైన వేటతుల్లి ఆట ఆడారు.18 మెట్లలకు ప్రత్యేక పుజలు చేసీ కర్పూరం వెలిగించారు. ఈకార్యక్రమంలో గురు స్వాములు అంకతి భరత్ కుమార్,మెట్ పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ కున గోవర్ధన్ ,సౌడల సంజివ్,జిందం శ్రీనివాస్,అరె రమేష్,పుప్పాల రాజేష్,దేశెట్టీ రమేష్, మైలరపు లక్మణ్,చెదలు తిరుపతి, గురిజల రవి,జక్కపెళ్ళి శేఖర్, సుద్దల కార్తిక్ గౌడ్,న్యావనంది వినోద్,దుంపెట ముత్యం,అయ్యప్ప స్వామి దీక్ష పరులు,మహిళలు భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## మొక్కజొన్న రైతులకు మొండి చెయ్యి



**చురకలు విలేకరి, రాయికల్, డిసెంబర్ 17 :** కొనుగోలు కేంద్రాల్లో మక్కలు తూకం వేసి నెల రోజులు గడుస్తున్న రైతుల ఖాతాలో తూకం డబ్బులు జమ చేయకుండా రేవంత్ సర్కారు మొక్కజొన్న రైతులకు మొండి చెయ్యి చూపిందని రాయికల్ బిజెపి పట్టణ అధ్యక్షులు కుర్మ మల్లారెడ్డి  అన్నారు. బుధవారం పాత్రికేయులతో మాట్లాడుతూ రైతులకు చేదోడుగా ఉంటున్నానని చెప్పుకుంటున్న రేవంత్ రెడ్డి సర్కార్ మక్కల కొనుగోలు కేంద్రాన్ని దళారులకు అప్పజెప్పి కమీషన్లు పొందుతుందని ఆరోపించారు.క్వింటాల్ ధాన్యం తూకం హమాలి ఖర్చులు రూ.35 నుంచి 40 ఉండగా క్వింటాల్ వెంబడి 60 రూపాయలు వసూలు చేస్తున్న రాయికల్ ఏఎంసి కాంట్రాక్టర్ మల్లికార్జున్ పై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తూకం వేసిన మొక్క జొన్న ధాన్యం డబ్బులు రైతు ఖాతాలో జమ చేసి రైతులకు న్యాయం చేయాలన్నారు.

## రైతులు బిల్లులు సకాలంలో చెలించాలి

**-విద్యుత్ శాఖ డిఈ మధుసూదన్**



**చురకలు విలేకరి,మెట్‌పల్లి రూరల్, డిసెంబర్ 17 :** రైతులు వ్యవసాయ కరెంట్ బిల్లులను సకాలంలో చెలించి విద్యుత్ అధికారులకు సహకరించాలని రైతులకు ఎలాంటి సమస్యలను ఉన్న విద్యుత్ అధికారులను సంప్రదించాలని విద్యుత్ శాఖ డిఈ మధుసూదన్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పాటిమీద తండా,ఆత్మకూర్ గ్రామంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పొలం బాట కార్యక్రమన్ని నిర్వహించారు. ఈ మేరకు రైతులతో డిఈ మాట్లాడుతూ రైతులు తమ మోటార్లకు కేపాసిటర్లు అమర్చి కరెంట్ దగ్గర పొల్లలో భద్రత చర్యలను పాటించాలని సూచించారు. విద్యుత్ విషయంలో సమస్యలు, అంతరాయం ఏర్పడితే ఏ.ఇ, లైనెమన్ లను కలిసి సమస్యలను తీర్చుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో టేక్నీకల్ డిఈ అంజయ్య, ఏడిఈ రవి,ఏఈ రమేష్,తాజా సర్పంచ్ హపవత్ రాజు, రైతులు పాల్గొన్నారు.

## జనావాసాల మధ్య మురికి నీరు..

**-పట్టించుకోని మున్సిపల్ యంత్రాంగం**



**చురకలు విలేకరి, జగిత్యాల, డిసెంబర్ 17 :** జగిత్యాల పట్టణంలో బైపాస్ రోడ్డు 1వ వార్డు సీతారాంనగర్ లో జనావాసాల మధ్య డ్రైనేజీ మురుగునీరు ప్రవేశించడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతూ, పిల్లలు రోగాల పాలవుతున్నారని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. మురికి కాలువలు నిర్మించకపోవడంతో మురుగునీరు అంతా రోడ్లమీద పారుతూ నీరు ఎక్కువైన కొద్దీ ఇళ్లలోకి కూడా వస్తుందని ఈ సందర్భంగా కాలనీవాసులు మున్సిపల్ సిబ్బందికి తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు మున్సిపల్ అధికారులను కలిసి వినతి పత్రం ఇచ్చిన పట్టించుకోవట్లేదని కాలనీవాసులు తెలిపారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు, సిబ్బంది స్పందించి మురుగు కాలువలు నిర్మించి మురుగు నీరు వెళ్లలోకి, రోడ్లమీద పొరకుండా తగిన చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

# విద్యార్థుల్లోని కళా నైపుణ్యానికి పోటీలు ఎంతో దోహదం చేస్తాయి

**-కోరుట్ల ఎమ్మెల్యే డా.కల్వకుంట్ల సంజయ్ కుమార్**



**చురకలు విలేకరి, మల్లాపూర్, డిసెంబర్ 17 :** విద్యార్థుల్లో దాగి ఉన్న కళానైపుణ్యానికి వివిధ పోటీలు ఎంతో దోహదం చేస్తాయని కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ కుమార్ పేర్కొన్నారు. మల్లాపూర్ మండలంలోని కొత్త దామ్ రాజ్ పల్లి గ్రామంలో గల కేరళ హైస్కూల్ విద్యార్థులు తెలంగాణా ఎడ్యుకేషనల్ డెవలప్మెంట్ సోసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి చేతిరాత, డ్రాయింగ్ పోటీల్లో ప్రతిభ కనబర్చారు. డ్రాయింగ్ లో సీనియర్ విభాగంలో శ్రీనిత్, జూనియర్ విభాగంలో ఇమ్రాన్, సబ్ జూనియర్ విభాగంలో జహనవి, చేతి వ్రాతలో సీనియర్ విభాగంలో దేవప్రియ, జూనియర్ విభాగంలో దీక్షిత, సబ్ జూనియర్ విభాగంలో ప్రవర రెడ్డి ఉత్తమ ప్రతిభ కనబర్చి జ్ఞాపికలతో పాటు ప్రశంసాపత్రాలను పొందారు. బహుమతి పొందిన విద్యార్థులను ప్రోత్సహిస్తున్న ఉపాధ్యాయులను, వారి తల్లిదండ్రులను కోరుట్ల ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ అనీల్ సింగ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్




**చురకలు విలేకరి, ధర్మపురి, వెల్గటూర్/ గొల్లపల్లి/ ఎండపల్లి, డిసెంబర్ 17 :** జగిత్యాల జిల్లాలో మూడవ విడత గ్రామ పంచాయితీ ఎన్నికల పోలింగ్లో భాగంగా ధర్మపురి మండలంలోని జైన,రాజారాం, రాయ పట్నం గ్రామాలు,ఎండపల్లి మండలం లోని రాజారాంపల్లి,గుల్లకోట గ్రామాలు, పెగడపల్లి మండలంలోని సంచర బతికేపల్లి గ్రామాలు,అలాగే వెల్లటూర్, గొల్లపల్లి మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ సెంటర్లను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పరిశీలించారు.ఈ సందర్భంగా పోలింగ్ ఏర్పాట్లు, సిబ్బంది హాజరు,మౌలిక సదుపాయాలు, భద్రతా చర్యలు తదితర అంశాలను కలెక్టర్ పరిశీలించి అధికారులకు తగిన సూచనలు చేశారు. పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా,సారదర్శకంగా, ఎలాంటి అవాంతరాలు లేకుండా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆదే శించారు. అలాగే కౌంటింగ్ ప్రక్రియ సజావుగా, త్వరితగతిన పూర్తి అయ్యేలా ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆర్ఓ అధికారులకు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో గౌతంరెడ్డి, నోడల్ ఆఫీసర్లు రఘువరన్, నరేష్, మదన్మోహన్, రేవంత్, జగిత్యాల ఆర్డీఓ మధుసూదన్, జగిత్యాల డీఎస్పీ రఘుచందర్, సంబంధిత ఎంపీడీవోలు, ఎమ్మార్వోలు ,ఇతర అధికారులు పాల్గొన్నారు.

# పెన్షనర్లకు సత్వర సేవలు అందిస్తాం

**-జిల్లా అసిస్టెంట్ ట్రెజరీ అధికారి ఎస్.మధు కుమార్**



**చురకలు విలేకరి, జగిత్యాల డిసెంబర్ 17 :** పెన్షనర్లకు ట్రెజరీ శాఖ తరపున సత్వర సేవలు అందిస్తామని జిల్లా ట్రెజరీ అధికారి ఎస్.మధు కుమార్ అన్నారు.బుధవారం జిల్లా కేంద్రంలోని సీనియర్ సిటీజేన్స్ కేంద్రంలో తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో జాతీయ పెన్షనర్ల దినోత్సవం వేడుకలు రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమం లో 116 మంది విశిష్ట పెన్షనర్లను డైరీ, క్యాలెండర్,మెమోంటో,పిలుపు పత్రికలు అందించి ఘనంగా జిల్లా అసిస్టెంట్ ట్రెజరీ అధికారి మధు కుమార్,రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్,రిటైర్డ్ జాయింట్ కలెక్టర్ కృష్ణా రెడ్డి చేతుల మీదుగా సన్మానించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎ.టి.వో మధుకుమార్ మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న పెన్షనర్ల రాష్ట్ర కార్యదర్శి,జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో సంఘం ప్రతినిధులను అభినందించారు. టి.పి.సి.ఏ.రాష్ట్ర కార్యదర్శి,జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం రాజీ లేని పోరాటం చేస్తామన్నారు.2024 ఏప్రిల్ 1 నుంచి 2025 నవంబర్ 30 వరకు రిటైర్మెంట్ ఆయిన వారికి పెన్షన్ బకాయిలు వెంటనే చెల్లించాలని,పెండింగ్ డి.ఏలు విడుదల చేయాలని,మెరుగైన ఫిట్మెంట్ తో పీఆర్సీ మంజూరు చేయాలని ప్రభుత్వంను డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి,జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్,జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సి.హన్మంత రెడ్డి, కోశాధికారి గౌరిశెట్టి విశ్వనాథము, ఉపాధ్యక్షులు వేల్ముల ప్రకాష్ రావ్, ఎమ్.డి.యాకూబ్,ఆర్గనైజింగ్ కార్యదర్శి బొబ్బటి కరుణ,కట్ట గంగాధర్, ఎమ్.డి. ఇక్బాల్,సయ్యద్ యూసుఫ్,జగిత్యాల యూనిట్ అధ్యక్షుడు బి.రాజేశ్వర్,కోరుట్ల అధ్యక్షుడు పబ్బా శివానందం,మల్యాల అధ్యక్షుడు వీరారెడ్డి,వివిధ మండలాల కార్యవర్గాల ప్రతినిధులు,సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# డ్యూటీతో పాటు మానవత్వం, బాధ్యత చాటిన కమీషనరేట్ పోలీసులు





**చురకలు ప్రతినిధి కమాన్పూర్ డిసెంబర్ 17 :** పెద్దపల్లి జిల్లా రామగుండం పోలీస్ కమీషనరేట్ పరిధిలో జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో పోలీసులు మానవత్వం చాటారు. పోలింగ్ కేంద్రాలకు వోటు వేయడానికి వచ్చిన వృద్ధులు నడవడానికి ఇబ్బంది పడుతున్న విషయం గమనించిన పోలీసులు వెంటనే సహాయం చేశారు. అందుగులపేట స్కూల్లో ఏఎస్ఐ మల్లేష్, తుర్కపల్లి గ్రామంలో J. విశ్వనాథ్,సిర్సలో స్పెషల్ పార్టీ కానిస్టేబుల్ నీతిన్ వీల్చెయిర్, స్ట్రెచర్ లేదా భుజాన ఎక్కించి పోలింగ్ బూత్ వరకు తీసుకెళ్లి వృద్ధులు తమ ఓటు హక్కును వేయడానికి సహాయపడ్డారు. పోలీసుల మానవీయ చర్యను స్థానిక ప్రజలు అభినందించారు. పోలీసులు డ్యూటీతో పాటు మానవత్వాన్ని కూడా పాటించడం ఎంతో ప్రశంసనీయం అని అధికారులు తెలిపారు. ఎన్నికలు శాంతియుతంగా జరగాలన్న ఉద్దేశంతో ప్రతి పోలీస్ సిబ్బంది కృషి చేస్తున్నారు.

## పెన్షనర్స్ భవన్లో లిఫ్టును ప్రారంభించిన ఎమ్మెల్యే



**చురకలు విలేకరి, జగిత్యాల, డిసెంబర్ 17 :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జగిత్యాల జిల్లా పెన్షనర్స్ భవన్ లో అదనపు గది, నూతనంగా ఏర్పాటు చేసిన లిఫ్ట్ ను బుధవారం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ప్రారంభించారు.అనంతరం పెన్షనర్స్ డే వేడుకల సందర్భంగా పెన్షనర్స్ ను సంజయ్ కుమార్ సన్మానించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కరబుజ రవీందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్ కుమార్, కోశాధికారి గుండెటి గంగాధర్, నాయకులు బద్దం జగన్ మోహన్ రెడ్డి దుమాల రాజ్ కుమార్ శ్రీనివాస్ ప్రభాత్ సింగ్ ఠాగూర్ ప్రవీణ్ రావు, జిల్లా అర్బన్ యూనిట్ సభ్యులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన అదనపు ఎస్పీ



**చురకలు విలేకరి,వెల్లటూర్,డిసెంబర్ 17 :** జగిత్యాల జిల్లాలో మూడవ విడత గ్రామ పంచాయితీ ఎన్నికల సందర్భంగా వెల్గటూర్ మండలంలో జరుగుతున్న ఎన్నికల సరళిని బుధవారం జిల్లా అదనపు ఎస్పీ శేషాద్రిని రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ల్లాలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పెట్రోలింగ్ వాహనాలు, ప్రత్యేక పోలీసు బృందాలు నిరంతరం పర్యటిస్తూ శాంతి భద్రతలను పర్యవేక్షిస్తారని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వహిస్తున్న అధికారులు కు, సిబ్బందికి అదనపు ఎస్పీ భద్రత పరమైన పలు సూచనలు చేశారు.

## ఎండపల్లి మండల సర్పంచులు వీరే....









**చురకలు విలేకరి, ఎండపల్లి, డిసెంబర్ 17 :** ఎండపల్లి మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం గ్రామ పంచాయితీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మండలంలోని ఆయా గ్రామాల్లో 83.72 శాతం పోలింగ్ నమోదైంది. కాగా శానబండ సర్పంచ్ గా గాదం భాస్కర్, సూరారం సర్పంచ్ గా కొడిపెల్లి కొమురమ్మ, పడకల్ సర్పంచ్ గా బెద్దల ప్రవీణ్, ఉండడా సర్పంచ్ గా ఆవుల మమత తిరుపతి, గుల్లకోట సర్పంచ్ గా గొల్లపల్లి మల్లేష్, పాతగూడురు సర్పంచ్ గా జగదీశ్వర్రెడ్డి, చర్లపల్లి సర్పంచ్ గా పడదాం మొగిలి, ముంజంపల్లి సర్పంచ్ గా సింగిరెడ్డి లింగారెడ్డి, సంకెనపల్లి సర్పంచ్ గా కోదూరుపాక పూజిత, ఎండపల్లి సర్పంచ్ మారం సునీత లు విజయం సాధించారు. గెలిచిన సర్పంచులు, వార్డు మెంబర్లకు రిటర్నింగ్ అధికారులు నియమాక పత్రాలను అందించారు.

# ఖత్మే బుఖారీ ఆధ్యాత్మిక సదస్సుపోస్టర్ ఆవిష్కరణ

**-మదర్సా ఇస్లాహుల్ బనాత్ ప్రిన్సిపాల్ ముఫ్తి ఘియాస్ మొహియుద్దీన్ పిలుపు**



**చురకలు ప్రతినిధి కరీంనగర్ డిసెంబర్ 17 :** ఈనెల 29న సోమవారం రాత్రి ఇషా నమాజ్ అనంతరం మదర్సా ఇస్లాహుల్ బనాత్ లో ఆలిం కోర్స్ ను విజయవంతంగా పూర్తిచేసిన యువతులు,మహిళలకు ఖత్మే బుఖారీ చివరి పాఠ్యాంశాన్ని బోధించే ఆధ్యాత్మిక బహిరంగ సదస్సును (జల్సా)ను విజయవంతం చేయాలని మదర్సా ప్రిన్సిపాల్ ముఫ్తి ఘియాస్ మొహియుద్దీన్ కరీంనగర్ ముస్లిం సమాజానికి పిలుపునిచ్చారు. బుధవారం నగరంలో హుస్సేనీ పురలోని మదర్సా ఇస్లాహుల్ బనాత్ లో ఈ ఆధ్యాత్మిక సదస్సు పోస్టర్ను ఆవిష్కరించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సుప్రసిద్ధ గుజరాత్ దాబెల్ మదర్సా నుంచి మౌలానా, ఖారీ రషీద్ అహ్మద్ అజ్మెరి హాజరవుతున్నట్లు చెప్పారు. మదర్సా అరబియా హిఫ్జుల్ ఖురాన్ శాఖగా మదర్సా ఇస్లాహుల్ బనాత్ బాలికలు, యువతుల కోసం కరీంనగర్ పట్టణంలో స్థాపించి ఆధ్యాత్మిక రంగంలో ఇస్లామిక్ విద్యలో అగ్రగామిగా నిలిపామన్నారు. మదర్సా అరబియా హిఫ్జుల్ ఖురాన్ కరీంనగర్ ముస్లిం సమాజం సేవలో గత 40ఏండ్లుగా ఉన్నత స్థాయిలో సేవలు అందిస్తోందన్నారు. కరీంనగర్ ముస్లిం సమాజం ఆదరాభిమానాలతో, దాతల సహకారంతో,ఇతోధికంగా విరాళాలతో ఈ రెండు మదర్సాలు నిర్వహిస్తు న్నామన్నారు. ఖురాన్ తర్వాత పెద్ద పుస్తకమైన ఖత్మే బుఖారీ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ముస్లింలు హాజరుకావాలని పిలుపునిచ్చారు. మహిళల కోసం పరదా సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. ఈకార్యక్రమంలో హాఫీజ్ అహ్మద్ హిఫ్జి, అబ్దుల్ రాఫె, తౌహీద్, అబ్దుల్ హమీద్, మహమ్మద్ రఫీ, యూసుఫ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

### సుడా చైర్మన్ ఆధ్వర్యంలో మంత్రులు శ్రీధర్ బాబు,

# పొన్నం ప్రభాకర్‌లను కలిసిన నూతన సర్పంచులు



**చురకలు ప్రతినిధి కరీంనగర్ డిసెంబర్ 17 :** ఇటీవల గెలిచిన కరీంనగర్ నియోజకవర్గానికి చెందిన సర్పంచులు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్ లో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు,పొన్నం ప్రభాకర్ లను కలిశారు. మంత్రులు గెలిచిన సర్పంచులను అభినందించి ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని అర్హత ఉన్న ప్రతి ఒక్క లబ్ధిదారుడికి పథకాలు అమలయ్యే విధంగా చూడాలని సూచించారు. గ్రామాలలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలని ఏఏ గ్రామాలకు ఎన్ని నిధులు అవసరమో అంచనాలు రూపొందించి ఇవ్వాలని సూచించారు. సర్పంచుల గెలుపుకు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి చేసిన కృషి అభినంద నీయమని పేర్కొన్నారు. మంత్రులను కలిసిన వారిలో చర్లభూత్కూర్, చామనిపల్లి,దుబ్బపల్లి బహదూరా?న్ పేట్,జూబ్లీ నగర్, ఎలబోతారం,ఫకీర్ పేట్,చేగుర్తి,నల్లగుంట పల్లె సర్పంచులు ఉపసర్పంచులు ఇరుకుల్ల ఉప సర్పంచ్ మరియు మండల కాంగ్రెస్ అధ్యక్షులు కాంరెడ్డి రాంరెడ్డి,పంజాల స్వామి గౌడ్, నాయకులు పెంచాల లక్ష్మణ్ రావు,బుర్ర నారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# కన్నాల సర్పంచ్‌కు ఘన సన్మానం



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ డిసెంబర్ 17 :** పాలకుర్తి మండలం కన్నాల సర్పంచ్ మల్కా రామస్వామిని ఘనంగా సన్మానించారు. మంత్రి దుదిల్ల శ్రీధర్ బాబు.. డిసిసి అధ్యక్షులు రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్సింగ్ . పీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిల్ల శీను బాబు ఆదేశాల మేరకు మంథని నియోజకవర్గం పాలకుర్తి మండల కన్నాల గ్రామ సర్పంచ్ గా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్కరామస్వామి ఘనంగా సన్మానించారు. గెలుపుకు కృషిచేసిన కన్నాల గ్రామ ఇన్చార్జి గుండేటి రాజేష ను ఘనంగా సన్మానించిన కన్నాల గ్రామ సర్పంచ్.. ఉప సర్పంచ్ మరియు వార్డ్ మెంబర్లు.... మల్కరామస్వామినీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ప్రకటించినప్పటినుండి చివరి వరకు గెలిచే వరకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులను. కొంతమంది ముఖ్యులను కలుస్తూ పర్యవేక్షిస్తూ అక్కడక్కడ అవసరమన్నచోట అసంతృప్తులను బుజ్జగిస్తూ గెలుపు కోసం చాణక్య నీతితో పావులు కదుపుతూ పార్టీ అంటే సుప్రీమ్ అని పార్టీకి పనిచేసే అభ్యర్థిని గెలిపించుకుంటే పార్టీ గుర్తిస్తుంది చెబుతూ సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన మాజీ ఎంపిటిసి దేవి లక్ష్మీ నరసయ్యను ఉపసంహరించి పార్టీలో మీకు భవిష్యత్తు ఉంటుందని చెప్పి. లోకల్ క్యాడర్లో ఉత్సాహాన్ని నింపి ప్రతి ఎదుటివారిని కదలికలను గమనిస్తూ సూచనలు చేస్తూ కన్నాల గ్రామంలోనే తిష్ట వేసి దీక్షల పనిచేసి అభ్యర్థన గెలిపించి తీసుకొస్తానని కాంగ్రెస్ పెద్దలకు మాట ఇచ్చి గెలిపించడం జరిగింది.. పెద్దల ఆశీస్సులతో గుండేటి రాజేష్ను అభినందించడం కూడా జరిగింది. కన్నాలలో విజయోత్సవ ర్యాలీ జరిగింది. ర్యాలీలో సర్పంచ్ మల్కా రామస్వామి.. ఉప సర్పంచ్ సయ్యద్ చాంద్ పాషా.. వార్డు సభ్యులు.. మాజీ ఎంపిటిసి దేవి స్రవంతి..మాజీ సర్పంచ్ చంద్రకళ..సీనియర్ నాయకులు ఎండి ఫయాజ్ బుర్ర నారాయణ. డాక్టర్ శ్వేత తిరుపతి. యువత అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# ముస్లిం డాక్టర్ హిజాబ్ తొలగించిన సీఎం నితీష్ కుమార్ క్షమాపణ చెప్పాలి

**-ఎంఐఎం పార్టీ జాయింట్ సెక్రెటరీ సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రీ యూసుఫ్**



**చురకలు ప్రతినిధి కరీంనగర్ డిసెంబర్ 17 :** బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ముస్లిం మహిళ డాక్టర్ అని చూడకుండా హిజాబ్‌ను తొలగించటం అన్యాయమని, ఇలాంటి దిగజారుడు పనిచేసిన సీఎం నితీష్ కుమార్ ముస్లిం సమాజానికి,బేషరతుగా క్షమాపణలు చెప్పాలని ఎంఐఎం పార్టీ జాయింట్ సెక్రెటరీ హాఫీజ్ సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రీ యూసుఫ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మోయిజోద్దీన్ ఖాదిరి యూసుఫ్ మాట్లాడుతూ సీఎం క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ ఆయుష్ వైద్యులకు నియామక పత్రాలను అందజేస్తున్న సమయములో ఆయుష్ డాక్టర్ గా నియమకమైన నుస్రత్ పర్వీన్ బుర్ఖాలో హిజాబ్‌తోని వచ్చిన ఆమెను బలవంతముగా ఆమె ముఖముపై ఉన్న హిజాబ్‌ను తొలగించి సీఎం హెూదాలో నితీష్ కుమార్ చేసిన పని సభ్య సమాజం తలదించుకునేలా ఉందన్నారు. సీఎం హెూదాకు నితీష్ కుమార్ కళంకం తీసుకొచ్చారని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకమైన చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు.

# పెద్దపల్లి మండలంలో కాంగ్రెస్ పార్టీదే హవా...



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ డిసెంబర్ 17 :** పెద్దపల్లి మండలంలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన మెజార్టీ స్థానాలను కైవసం చేసుకున్నాయి. పెద్దపల్లి మండలం లో గెలుపొందిన 30 గ్రామాల సర్పంచ్ అభ్యర్థులు ప్రకటించగా ఇందులో సుమారు 20 మంది పైచిలుకు కాంగ్రెస్ అభ్యర్థులే గెలుపొందారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే విజయరమణారావు పట్టుదలతో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకున్నారు. ఇందులోఅందుగులపల్లి – గుర్రపు అంజయ్య (కాంగ్రెస్) దేవునిపల్లి – బొక్కల రేఖ(కాంగ్రెస్). రంగాపూర్ –గంట రమేష్ (కాంగ్రెస్) సబ్బితం – నూనె సరోజన(కాంగ్రెస్). రాఘవపూర్ –తాడి చెట్టు చామంతి శ్రీకాంత్ (బి ఆర్ ఎస్) గౌరెడ్డిపేట – కొమ్ము సుజాత అభిలాష్ (కాంగ్రెస్) ముత్తారం – నల్లగొండ కుమార్(కాంగ్రెస్). గుర్రాంపల్లి – తొగరి సంపత్(కాంగ్రెస్). మారేడుగొండ – గుర్రం దేవేంద్ర నాగరాజు (కాంగ్రెస్). రాంపల్లి – కాంగ్రెస్ ఏకగ్రీవం కనపర్తి సంపత్ రావు, హన్మంతునిపేట – మ్యాడగోని శ్రీనివాస్ గౌడ్ (కాంగ్రెస్). బోజన్నపేట – బండారి త్రివేణి అనిల్ (కాంగ్రెస్ ),చీకురాయి – ఓదెల శ్రీనివాస్ (కాంగ్రెస్),కొత్తపల్లి – పెరిక రిబిక సంతోష్ (కాంగ్రెస్),మూలసాల – జక్కుల శ్వేత (కాంగ్రెస్),పెద్దబొంకూర్ – కలువల తిరుపతి (కాంగ్రెస్),పెద్దకల్వల – నర్ల పోలు రాజు (కాంగ్రెస్) నిమ్మనపల్లి – వేల్పుల రమేష్(బిజెపి). నిట్టూర్ – ఆకుల సువర్ణ శ్రీనివాస్ (బీఆర్ఎస్). తుర్కలమద్దికుంట –గోగు రాజయ్య (కాంగ్రెస్),కాసులపల్లి – గద్దల రాజశేఖర్(స్వతంత్ర). పాలితం – వెలిచాల రాజయ్య (కాంగ్రెస్),గోపయ్యపల్లి – అంజి నాయక్(కాంగ్రెస్). కాపులపల్లి – మ్యాడాగోనా మల్లేష్ (కాంగ్రెస్) కనగర్తి – ఎడెల్లి శ్రీదేవి శంకర్ (కాంగ్రెస్). రాగినేడు – సోమా కుమార్ (కాంగ్రెస్) బ్రాహ్మణపల్లి – మేకల రోజారాణి విజయ్ (స్వతంత్ర టిఆర్ఎస్ మద్దతు). అప్పన్నపేట – అరె సంతోష్ (కాంగ్రెస్),బొంపెల్లి –దాడి మౌనిక సంతోష్ (బి జే పీ కుర్మపల్లి – గొర్రె లక్ష్మి రాజయ్య (బీఆర్ఎస్). గ్రామాల వారీగా గెలుపొందారు.

# పెన్షనర్ల సమస్యలపై, హెల్త్ కార్డుల సాధనకు పోరాటం

**-ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్ రెడ్డి**
**హుజురాబాద్ లో పెన్షనర్స్ డే కు హాజరైన ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి**



**చురకలు ప్రతినిధి, హుజురాబాద్, డిసెంబర్ 17 :** పెన్షనర్ల సమస్యలపై, పెన్షనర్లకు హెల్త్ కార్డుల కోసం ప్రభుత్వంపై పోరాటం చేసి ఒత్తిడి తెచ్చి సాధిస్తామని వరంగల్ - ఖమ్మం - నల్గొండ నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్ రెడ్డి అన్నారు. బుధవారం హుజురాబాద్ పట్టణంలోని పెన్షనర్స్ భవనంలో పెన్షనర్స్ డే నిర్వహించారు. తెలంగాణ పెన్షనర్స్ అసోసియేషన్ హుజురాబాద్ యూనిట్ అధ్యక్షుడు ఎండి ఉస్మాన్ పాషా అధ్యక్షతన జరిగిన సమావేశంలో శ్రీపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ.. తాను కూడా ఎమ్మెల్సీగా పోటీ చేసే ముందు స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసానని, తనకూడా ఒక విశ్రాంత ఉద్యోగినే అని, పెన్షనర్ నే అని అన్నారు. ప్రభుత్వం ఉద్యోగ విరమణ వయసు పెంచిన తర్వాత 2024 నుండి చాలా మంది ఉద్యోగ విరమణ చేస్తున్నారని తెలిపారు. కానీ ప్రభుత్వం నుండి వారికి చెల్లించాల్సిన బకాయిలు చెల్లించడం లేదని, ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులకు బెనిఫిట్స్ అందక ఇబ్బందులు పడుతున్నారని, మానసిక ఆందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. వారందరికీ ప్రభుత్వం వెంటనే బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేసారు. పెన్షనర్లు ఐక్యతతో, సమన్వయంతో పనిచేసి తమ హక్కులు సాధించుకోవాలని అన్నారు. తాను పెన్షనర్లకు ఎల్లవేళలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. పెన్షనర్ల సమస్యలపై ప్రభుత్వంతో చర్చిస్తామని, ఒత్తిడి తెస్తామని శ్రీపాల్ రెడ్డి స్పష్టం చేసారు. ఉస్మాన్ పాషా, గంజి జయవర్ధన్ ఆధ్వర్యంలో హుజురాబాద్ యూనిట్ చేపడుతున్న కార్యక్రమాలు తెలుసుకున్న శ్రీపాల్ రెడ్డి వారిని ప్రత్యేకంగా అభినందించారు.

**92 మంది పెన్షనర్లకు సన్మానం**

పెన్షనర్స్ డే సందర్భంగా 92 మంది పెన్షనర్లకు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్ రెడ్డి చేతుల మీదుగా ఘనంగా సన్మానించారు. హుజురాబాద్ లో పెన్షనర్స్ డే లో పాల్గొనడం తనకు ఆనందంగా ఉందని, మంచి కార్యక్రమాన్ని నిర్వహించారని ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ హుజురాబాద్ యూనిట్ అధ్యక్షులు ఎండి ఉస్మాన్ పాషా, ప్రధాన కార్యదర్శి గంజి జయవర్ధన్, ఉపాధ్యక్షులు కోయల్కర్ దుర్గాజి, మేడిశెట్టి నర్సయ్య, అసోసియేట్ అధ్యక్షులు వి. లక్ష్మయ్య, కార్యవర్గ సభ్యులు కె ప్రభాకర్, జె రామ్ రెడ్డి, జి రాజయ్య, పి లక్ష్మీనారాయణ, గణపతి రెడ్డి, కాసర్ల శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

# రాజపల్లిలో "మల్లన్న" గెలిచాడు

**-300 ఓట్ల మెజారిటీతో విజయం**
**-పాత్రికేయునిగా, డిప్యూటీ ఈఈగా పనిచేసిన కట్కూరి మల్లా రెడ్డి**
**-ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి,బండ శ్రీనివాస్ అభినందన**



**(కోరెం సుధాకర్ రెడ్డి, చురకలు ప్రతినిధి, హుజురాబాద్)**

హుజురాబాద్ మండలం రాజపల్లి సర్పంచిగా కట్కూరి (వార్త) మల్లారెడ్డి గెలుపొందారు. ఇక్కడ ద్విముఖ పోటీ జరిగింది. మల్లా రెడ్డికి 560 ఓట్లు రాగా అయన ప్రత్యర్ధి ఆలుమల్ల సురేందర్ రెడ్డికి 260 ఓట్లు మాత్రమే వచ్చాయి. సుమారు 300 ఓట్ల మెజారిటీ తో మల్లారెడ్డి గెలుపొందినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. మల్లారెడ్డి సుదీరకాలం హుజురాబాద్ లో వార్త దినపత్రిక విలేకరిగా పనిచేసారు. అలాగే విద్యాశాఖ ఇంజనీరింగ్ విభాగంలో డిప్యూటీ ఈ ఈ గా పనిచేసి ఉద్యోగ విరమణ చేసారు. ఐతే ఉద్యోగ విరమణ అనంతరం ఆయన ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి సమక్షంలో బి ఆర్ ఎస్ లో చేరారు. బి ఆర్ ఎస్ నేతలు బండ శ్రీనివాస్, శంతన్ రెడ్డి తదితరులు రాజపల్లిలో ఇంటింటికి ప్రచారం చేసారు. సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసి గెలు పొందడం పట్ల మల్లారెడ్డికి పలు వురు అభినందనలు తెలిపారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, ఎస్సి కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్,బిఆర్ఎస్ నేత పోరెడ్డి శంతన్‌రెడ్డి, పాత్రికేయులు కోరెం సుధాకర్ రెడ్డి, తిరునగరి ఆంజనేయస్వామి, గడ్డం రాజిరెడ్డి, గడ్డం ధర్మారెడ్డి, మామిడి రవీందర్, మండల యాదగిరి (స్వర్ణో దయం), కేశిరెడ్డి నర్సింహా రెడ్డి, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కాయిత రాములు, కామని రవీందర్, కుడికాలు సురేష్ బాబు, జడల మహేష్, హర్షవర్ధన్, మాక్సుద్ రాజు, పరాంకుశం కిరణ్ కుమార్ తదితరులు మలారెడ్డికి అభినందనలు తెలిపారు.

**జనం రుణం తీర్చుకుంటా : కొత్తసర్పంచ్ కట్కూరి మల్లారెడ్డి**

తనకు ఓటేసి నమ్మకంతో ఆశీర్వదించి గెలిపించిన రాజపల్లి ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటానని, ఈ విజయం ప్రజలకు అంకితమని కొత్తగా సర్పంచ్ గా ఎన్నికైన కట్కూరి మల్లారెడ్డి స్పష్టం చేసారు. సర్పంచ్ గా గెలిచిన అనంతరం అయన విలేకరులతో మాట్లాడారు. ఈ గెలుపు తన బాధ్యతను మరింత పెంచిందని అన్నారు. తనకు, తన కుటుంబానికి ఎంతో సంతోషంగా ఉందని, ఇది ప్రజల విజయమని అన్నారు. తనకు ఆనంద భాష్పాలు వస్తున్నాయని,ఏమి మాట్లాడాలో తెలియడం లేదన్నారు. ఇకపై రాజకీయాలకు అతీతంగా పనిచేస్తానని, గ్రామాభివృద్ధికి ప్రభుత్వ, ప్రజాప్రతి నిధుల సహకారంతో పనిచేస్తానని అన్నారు. ఒక ఫోన్ కాల్ దూరంలో ప్రజలకు అందుబాటులో ఉంటానని, ఎవరికి పోలీస్ స్టేషన్ లో, తహాశీల్దార్ కార్యాలయంలో పని ఉన్నా ఒక ఫోన్ కాల్ చేస్తే స్పందిస్తానని, గ్రామస్తులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని తెలిపారు. తనకు ప్రచారంలో అండగా నిలిచిన గ్రామనాయకులకు, హుజురాబాద్ బిఆర్ఎస్ నేతలకు, ప్రోత్సహించిన పాత్రికేయులకు అయన కృతజ్ఞతలు తెలిపారు. తనకు మద్దతునిచ్చి ప్రోత్సహించిన ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, ఎస్సి కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# సుందిళ్ల గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తా

**-సర్పంచ్ ముసుకుల నరేందర్ రెడ్డి**



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ డిసెంబర్ 17 :** సుందిళ్ల గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తానని రామగిరి మండలం సుందిళ్ల సర్పంచ్ ముసుగుల నరేందర్ రెడ్డి అన్నారు. బుధవారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో సర్పంచ్ ఉప సర్పంచ్ వార్డు సభ్యులను ఘనంగా సన్మానించారు. సుందిల్ల గ్రామంలో గ్రామ పంచాయితీ ఎన్నికల్లో గెలిచిన నూతన సర్పంచ్ మస్కుల నరేందర్ రెడ్డి,ఉప సర్పంచ్ జనగామ సదానందం,గ్రామ ముదిరాజ్ సంఘం తరపున ఘనంగా పూలా మాలతో, శాలువాతో ,ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో గెలిపించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు. రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుదెర్ల శ్రీధర్ బాబు సహకారంతో గ్రామాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. మిగిలిపోయిన పనులను తాను పూర్తి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ముదిరాజ్ సంఘ సభ్యులు,యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కల్వచర్ల సర్పంచ్‌కు ఘన సన్మానం



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ డిసెంబర్ 17 :** రామగిరి మండలంలోని కలవచర్ల గ్రామానికి చెందిన నూతన సర్పంచ్ రేండ్ల శారద కుమారస్వామి లను అలనాటి తోటి విద్యార్థులు బుధవారం ఘనంగా సన్మానించారు.రామగిరి మండలంలో నూతనంగా ఎన్నికైన రేండ్ల శారద కుమారస్వామి ని 1995-96బ్యాచ్ 10 వ తరగతి కల్వచర్ల జిల్లాపరిషత్ పాఠశాల విద్యార్థులు శాలువాలతో సత్కరించి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. వారిని శాల్వాతో సత్కరించి మెమొంటోను బహుకరించారు. గ్రామస్తులు ఆశయాలను అడియాశలు చేయకుండా గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయాలని ఆయన మిత్రులు సూచించారు.

# పంచాయతీలో.. ఓటేశారు..

**-వీణవంకలో కౌశిక్,సింగాపురంలో ప్రణవ్**
**-ఓటేసిన కెప్టెన్, సతీష్ బాబు**







**చురకలు ప్రతినిధి, హుజురాబాద్, డిసెంబర్ 17 :** హుజురాబాద్ డివిజన్లో గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్ చివరిదశ బుధవారం జరిగింది. హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వీణవంక మండల కేంద్రంలో ఓటేశారు. కౌశిక్ తో పాటు అయన భార్య శాలినిరెడ్డి, తండ్రి పాడి సాయినాథ్ రెడ్డి, కుటుంబ సమేతంగా వచ్చి ఓటేశారు.కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ తన తండ్రి శ్రీనివాస రావు,కుటుంబ సభ్యులతో కలిసి ఓటేశారు. మాజీ ఎంపీ కెప్టెన్ వి లక్ష్మీకాంతరావు , మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్,మాజీ ఎంపీపీ వొడితల సరోజినీదేవి సింగాపురంలో జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఓటేశారు.పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో పోలింగ్ సిబ్బంది, అధికారులు, పోలీసు సిబ్బంది ఊపిరి పీల్చు కున్నారు.ఆయా గ్రామాల్లో ఓటర్లు ఉదయం నుండే పోలింగ్ కేంద్రాలకు రావడం ప్రారంభించారు.పలుచోట్ల వికలాంగులు, వృద్దులు వచ్చి ఓటేశారు.పోలింగ్‌ను ఎప్పటికప్పుడు కలెక్టర్ పమేలా సత్పతి, సిపి గౌస్ ఆలం పర్యవేక్షించారు.

# పెగడపల్లి మండలంలో కాంగ్రెస్ పార్టీ హవా

**-ధర్మపురి నియోజకవర్గంలో మెజార్టీ స్థానాల్లో గెలిచిన సర్పంచ్‌లు**



**చురకలు విలేఖరి పెగడపల్లి, డిసెంబర్ 17 :** పెగడపల్లి మండలంలో కాంగ్రెస్ పార్టీ ప్రభావం స్పష్టంగా కనిపించింది. తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అండతో పోటీ చేసిన అభ్యర్థులకు మెజార్టీ స్థానాల్లో గెలుపు వరించింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి భారీ ఆదరణ లభించింది. నియోజకవర్గం లోని మండలాల వారీగా కాంగ్రెస్ పార్టీ భారీగా సర్పంచి స్థానాలు గెలుచుకున్నాయి. సర్పంచ్ ఎన్నికల్లో సుమారు 90 శాతం స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఘన విజయం సాధించారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా అమలవుతున్న ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు ఉన్న విశ్వాసమే ఈ విజయానికి కారణమని పార్టీ నేతలు పేర్కొన్నారు. ఈ ఫలితాలు ధర్మపురి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి ఉన్న బలాన్ని మరింత స్పష్టం చేస్తున్నాయని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.

# కార్మికుల హక్కుల కాలరాసే లేబర్ కోడ్లను రద్దు చేయాలి



**చురకలు విలేకరి, జగిత్యాల, డిసెంబర్ 17 :** కార్మికుల హక్కులను కాలరాసే 4 లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలని, సేల్స్ ప్రమోషన్స్ అండ్ ఎంప్లాయిస్ 1976 చట్టాన్ని పునరుద్ధరించాలని తెలంగాణ మెడికల్ అండ్ సేల్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నేడు తలపెట్టిన చలో ఇందిరా పార్క్ మహా ధర్నాకు కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో మెడికల్ రెప్రజెంటేటివ్స్ హాజరై జయప్రదం చేయాలని సంఘం జిల్లా నాయకులు కోరారు. బుధవారం జగిత్యాల పట్టణంలోని బాంబే షాపింగ్ మాల్ వెనుక ప్రజాసంఘాల జిల్లా కార్యాలయంలో పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు పిన్నంశెట్టి రాము, సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కే.సునీల్, వి.అరవిందు్ల మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కరోనా సమయంలో దేశ వ్యాప్త ప్రజలు అనారోగ్యంతో ఆందోళనతో ఇబ్బందుల్లో ఉంటే కేంద్ర ప్రభుత్వం దొడ్డిదారిన దేశ ప్రగతి రథచక్రానికి కార్మిక హక్కులను కాలరాసే 4 లేబర్ కోడ్లను పార్లమెంట్లో చట్టంగా చేసి కార్మికుల నడ్డి విడిచి ప్రయత్నం చేసిందని, 44 కార్మిక చట్టాల నుండి 15 చట్టాలను తొలగించారని, ఫిక్స్ డ్ టర్మ్ ఎంప్లాయ్మెంట్ చట్టం వల్ల ఉద్యోగ భద్రత కార్మికులు కోల్పోతారని, కార్మికులకు సెలవు దినాలు ఉండవని, కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ సామ్రాజ్యవాద కంపెనీలకు ఊడిగం చేయడానికి ఈ దేశంలో శ్రామిక ప్రజల నడ్డి విరిచే కార్మికుల శ్రమ దోపిడీ చేసే నాలుగు లేబర్ కోర్టులను తీసుకొ చ్చిందన్నారు. తక్షణమే 4 లేబర్ కోడ్లను రద్దు చేయాలని సిఐటియూ నాయకత్వంలో దేశవ్యాప్త కార్మిక ఉద్యమాలు నిర్వహిస్తున్నామని నేడు వేలాదిమంది మెడికల్ రిప్రెంటేటివ్ కార్మికులు పెద్ద సంఖ్యలో చలో హైదరాబాద్ ఇంద్ర పార్క్ వద్ద ధర్నాకు జగిత్యాల జిల్లా నుండి భారీ ఎత్తున తరలి వెళ్తున్నామని 19వ తేదీ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేపడుతున్నామని తెలిసారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ కమిటీ సభ్యులు జీ ప్రణీత్, కేసేనాగరాజు జి శ్రీనివాస్ కే. వెంకటేష్ డి రాజు తదితరులు పాల్గొన్నారు.

# గొల్లపల్లి మండల సర్పంచులు వీరే

## -ప్రతి గ్రామంలో గట్టి పోటీ










**చురకలు విలేకరి,గొల్లపల్లి, డిసెంబర్ 17 :** గొల్లపల్లి మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం గ్రామ పంచాయితీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది.మండలంలోని ఆయా గ్రామాల్లో 80.85శాతం పోలింగ్ నమోదైంది.మండలంలోని చిల్వకోడూర్ సర్పంచ్గా దాసరి తిరుపతి(కాంగ్రెస్),గోవిందుపల్లె సర్పంచ్ గా మ్యాక స్వామి(కాంగ్రెస్), రంగధాములపల్లె సర్పంచ్ గా జెల్లా అఖిల,గంగిదేవుపల్లి సర్పంచ్గా కొలగాని జలంధర్(కాంగ్రెస్), అబ్బాపూర్ సర్పంచ్గా చిట్యాల సౌందర్య (బిఆర్ఎస్),దట్నూర్ సర్పంచ్ గా బెక్కం గంగారం(కాంగ్రెస్), ఆత్మకూరు సర్పంచ్గా రాజం పోశవ్వ, దమ్మన్నపేట సర్పంచ్గా ముదాం జానీ (కాంగ్రెస్),లక్ష్మీపూర్ సర్పంచ్గా కాసం రాజశేఖర్ (స్వతం),భీమ్రాజుపల్లి సర్పంచ్గా కొలగాని గంగాచారి, గుంజపడుగు సర్పంచ్గా నవ్వ అంజయ్య (బిఆర్ఎస్),బీబీ రాజుపల్లి సర్పంచ్గా ఓరగంటి తిరుపతి(కాంగ్రెస్) ,రాఘవపట్నం సర్పంచ్గా కాసారపు భవాని(కాంగ్రెస్),అగ్గిమల్ల సర్పంచ్ కంకణాల వసంత,నంది పల్లె సర్పంచ్ గా ఈర్నాల విజయ(కాంగ్రెస్), వెంగలాపూర్ సర్పంచ్గా మామిడిపల్లి రామ్ రెడ్డి (బిజెపి),శంకర్రావు పేట సర్పంచ్గా గోలి గంగారెడ్డి,రాపల్లె సర్పంచ్గా బుర్ర సుధారాణి, బొంకూర్ సర్పంచ్గా ముల్కాల శిరీష(కాంగ్రెస్), లోత్తునూరు సర్పంచ్గా ఆకుల సుమన్ (కాంగ్రెస్) సర్పంచులుగా గెలుపొందారు.

# వెల్గటూర్ మండలంలో సర్పంచ్ విజేతలు వీరే

## -కోటిలింగాలలో సమాన ఓట్లతో డ్రాలో పర్స కోటయ్య విజయం






**చురకలు, విలేఖరి, వెల్గటూర్, డిసెంబర్ 17 :** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలంలో తుదివిడత బుధ వారం జరిగిన పంచాయతీ ఎన్నికల్లో కోటిలింగాలలో ఇద్దరు అభ్యర్థులకు సమాన ఓట్లురాగా డ్రా ద్వారా బిఆర్ ఎస్కు చెందిన పర్స కోటయ్య విజేతగా నిలిచారు.ఉత్కంఠ వాతావరణంలో సాగిన కౌంటింగ్ అనంతరం వెల్గటూర్ సర్పంచ్గా బండ మీది కవిత గోపి, మొక్కట్రావు పేట సర్పంచ్గా కూస లక్ష్మన్,రాజక్కపల్లె సర్పంచ్ గా దోరిశెట్టి మల్లేశం, పాశిగాం సర్పంచ్ గా కాంద్రపు శిరీష,చెగ్యాం సర్పంచ్గా కుమ్మరిమల్లేశ్వరి,రాంనూర్ సర్పంచ్ గా ఐత తిరుపతి,జగదేవుపేట సర్పంచ్గా నల్ల తిరు పతి,కప్పరావుపేట సర్పంచ్ గా మ్యాకల పోచయ్య, బీరుసాని సర్పంచ్ గా కారుకూరి శరణ్య, కిషన్ రావుపేట సర్పంచ్ గా కుమ్మరి సునిత వెంకటేష్, శాఖపూర్ సర్పంచ్ వేముల సంగీత ప్రవీణ్,తాళ్ల కొత్తపేట సర్పంచ్ ద్యావనపల్లి సుధాకర్, మత్తునూర్ సర్పంచ్గా కుషనపల్లిలక్ష్మి పోచయ్య, సంకెనపల్లి కొదురుపాక స్థంభం పల్లి సర్పంచ్గా బూపెల్లి రాజయ్య, వెంకటా పూర్ సర్పంచ్గా బిళ్ళకూరి తిరుపతి, కుమ్మరిపల్లి సర్పంచ్గా జక్కుల మహేష్ ,దేవుపేట సర్పంచ్గా నల్ల తిరుపతి, కప్పరావుపేట సర్పంచ్గా మ్యాకల పోచయ్య,బీరుసాని సర్పంచ్గా కారు కూరి శరణ్య,కిషన్ రావుపేట సర్పంచ్ గా కుమ్మరి సునిత వెంకటేష్, శాఖపూర్ సర్పంచ్ వేముల సంగీత ప్రవీణ్,తాళ్ల కొత్తపేట సర్పంచ్ ద్యావనపల్లి సుధాకర్, మత్తునూర్ సర్పంచ్ గా కుషన పల్లి లక్ష్మి పోచయ్య,సంకెనపల్లి కొదురుపాక పూజ,స్థంభం పల్లి సర్పంచ్ గా బూపెల్లి రాజయ్య, వెంకటాపూర్ సర్పంచ్గా బిళ్ళకూరి తిరుపతి, కుమ్మరి పల్లి సర్పంచ్ గా జక్కుల మహేష్,లు గెలుపొందగా పైడిపల్లిలో కౌంటింగ్ లో అవకతవకలు జరిగినట్లు అనుమానంతో ఇద్దరు అభ్యర్థుల మధ్య ఘర్షణ చోటు చేసుకోగా ఫలితం వెలువ డే విషయం లో సంధిగ్ధం నెలకొంది.గొడవకు దారి తీయడంతో పోలీసు బాలగాలు చేరు కొని పరిస్థితి చక్కదిద్దే ప్రయత్నం చేస్తు న్నారు.వెల్గటూర్ మండలం లో మొత్తానికి కాంగ్రెస్ కు బిఆర్ఎస్ మద్దతు దారులు గట్టిపోటి ఇచ్చారు.

# పేరాల అమన్ రావు..

# వెన్నంపల్లి టూ.. రాజస్థాన్ రాయల్స్

## -ఐపిఎల్కు ఎంపికైన అమన్రావు



**(కోరెం సుధాకర్ రెడ్డి, చురకలు ప్రతినిధి, హుజురాబాద్)** సైదాపూర్ మండలం వెన్నంపల్లి గ్రామానికి చెందిన పేరాల అమన్ రావు (22) ఐ పి ఎల్ క్రికెట్ టోర్నీకి ఎంపికయ్యాడు. అమన్ రావు ఐ పి ఎల్ టోర్నీలో రాజస్థాన్ రాయల్స్ తరపున ఆడనున్నాడు. వెన్నంపల్లి గ్రామానికి చెందిన తాజా మాజీ జిల్లాపరిషత్ వైస్ చైర్మన్ పేరాల గోపాలరావు మనుమడే అమన్ రావు. అమన్ రావు తండ్రి మధుకర్ రావు హైదరాబాద్ లో వ్యాపారరిత్యా స్థిరపడ్డారు. అమన్ రావు క్రికెట్ పై బాల్యం నుండే ఆసక్తి కలిగిఉన్నాడు. హైదరాబాద్ లోని ఓ అకాడమీలో ప్రొఫెషనల్ గా శిక్షణ తీసుకున్నాడు. రంజీ ట్రోఫీలో అయన ప్రతిభను గుర్తించిన రాజస్థాన్ రాయల్స్ అమన్ ను రూ. 30 లక్షలు చెల్లించి తమ జట్టుకు ఎంపిక చేసుకుంది. వెన్నంపల్లి గ్రామానికి చెందిన అమన్ రావు ఐ పి ఎల్ కు ఎంపిక కావడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అమన్ ను ఈ సందర్భంగా అభినందిస్తున్నారు. అయన రాబోయే కాలంలో భారతజట్టులో స్థానం సంపాదించాలని ఆకాంక్షిస్తున్నారు.

# దేశ భద్రతకు ముప్పుగా 'శాంతి బిల్లు'

## - పార్లమెంట్లో మండిపడ్డ ఎంపీ గడ్డం వంశీకృష్ణ



**చురకలు ప్రతినిధి కమాన్పూర్ (న్యూఢిల్లీ)డిసెంబర్ 17 :** అణుశక్తి రంగంలో ప్రైవేట్ సంస్థలకు బాధ్యతలు అప్పగించేలా తీసుకొచ్చిన 'శాంతి బిల్లు' దేశ భద్రత, ప్రజల భద్రతకు తీవ్రమైన ప్రమాదమని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ పార్లమెంట్లో తీవ్రంగా విమర్శించారు.బిల్లుపై చర్చ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, "శాంతి బిల్లు అని పేరు పెట్టారు గానీ, ఇందులోని అంశాలు దేశానికి అశాంతిని తెస్తాయి. అణు ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది? సరఫరాదారులపై బాధ్యత తొలగిస్తే ప్రజల ప్రాణాలకు ఎవరు గ్యారంటీ ఇస్తారు?" అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.దేశంలో ఉగ్రవాద దాడులు, నిరుద్యోగం, రూపాయి విలువ పతనం, ఇండిగో వంటి కార్పొరేట్ సంక్షోభాలపై ప్రభుత్వం జవాబుదారీతనం చూపడం లేదని విమర్శించారు. గత 11 ఏళ్లుగా ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటివరకు సమాధానం ఇవ్వలేదని అన్నారు.ఫ్రాన్స్, రష్యా, చైనా, దక్షిణ కొరియా వంటి దేశాల్లో అణుశక్తి పూర్తిగా ప్రభుత్వ నియంత్రణలోనే ఉందని గుర్తు చేస్తూ, భారత్లో ఈ కీలక రంగాన్ని ప్రైవేట్ చేతుల్లో పెట్టడం ప్రమాదకరమని స్పష్టం చేశారు."అణు ప్రమాదం ఉద్దేశాన్ని చూడదు. అది ప్రైవేట్ ప్లాంటా, ప్రభుత్వ ప్లాంటా అన్న తేడా లేకుండా తరాల భవిష్యత్తును నాశనం చేస్తుంది. బాధ్యత చట్టాన్ని బలహీనపరచడం ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడటమే" అని ఆయన హెచ్చరించారు.అదానీ గ్రూప్ అణుశక్తి రంగంలో ఆసక్తి చూపిన వెంటనే ఈ బిల్లు రావడం యాదృచ్ఛికమా? అని ప్రశ్నించిన ఎంపీ, గత పదేళ్ల తప్పిదాల నుంచి ప్రభుత్వం పాఠాలు నేర్చుకోవాలని సూచించారు.ప్రైవేటీకరణ అణుశక్తి రంగంలో ప్రపంచవ్యాప్తంగా విఫలమైందని పేర్కొన్న ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఈ బిల్లును పునఃపరిశీలించి ప్రైవేట్ సంస్థలు, సరఫరాదారులపై కఠిన బాధ్యతలు విధించాలని డిమాండ్ చేశారు.

# ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలి

**-ఉపాధి హామీ పథకానికి మహాత్మ గాంధీ పేరు మార్చే ఆలోచన ఉపసంహరించుకోవాలి**
**-ఉపాధి హామీ పథకానికి అధిక నిధులు కేటాయించి.. మెరుగు పరచాలి**
**-ఉపాధి హామీ పథకం పని దినాలు పెంచటంపై హర్షం**
**-మాజీ మంత్రి టి.జీవన్ రెడ్డి**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, డిసెంబర్ 17 :** ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని, ఉపాధి హామీ పథకానికి మహాత్మ గాంధీ పేరు మార్చే ఆలోచన ఉపసంహరించుకోవాలని, ఉపాధి హామీ పథకానికి అధిక నిధులు కేటాయించి.. మెరుగు పరచాలని, ఉపాధి హామీ పథకం పని దినాలు పెంచటం పై హర్షం వ్యక్తం చేస్తున్నామని మాజీ మంత్రి టి.జీవన్ రెడ్డి అన్నారు. బుధవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్లో డిసిసి అధ్యక్షుడు గాజంగి సందయ్యతో కలసి విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి జీవన్ రెడ్డి మాట్లాడారు. అవినీతిని నిలువరించేందుకు, పారదర్శకత కోసం సమాచార హక్కు చట్టాన్ని, నిరుపేద వర్గాల ప్రజలు ఆకలితో అలమటించకూడదని ఆహార భద్రత చట్టాన్ని, విద్య ప్రాధాన్యతను గుర్తించి విద్యా హక్కు చట్టాన్ని, గ్రామీణ ప్రజలకు ఉపాధి కల్పించాలని ఉపాధి హామీ చట్టాన్ని యూపీఏ ప్రభుత్వం ప్రవేశ పెట్టిందని గుర్తు చేశారు. సోనియా గాంధీ ఆలోచన, మన్మోహన్సింగ్ దార్శనికతతో జాతిపిత మహాత్మ గాంధీ పేరిట జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంగా నామకరణం చేశారన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు పని కల్పించేందుకు ఉపాధి హామీ చట్టం రూపొందించారని, స్వాతంత్యం కోసం అహింసాయుతంగా పోరాటం చేసిన మహాత్మ గాంధీ స్మరించుకోవడం అందరి బాధ్యత అని అన్నారు. రెండు దశాబ్దాల కాలంలో ఉపాధి కల్పించడంతో పాటు, ప్రభుత్వాలు గ్రామీణ ప్రాంతంలో చేపట్టే ప్రతి అభివృద్ధి పని ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టారని, హరిత హారం గుంతలు తీయడం, వైకుంఠ ధామాలు, రైతు వేదికలు, డంపింగ్ యార్డులు, పాఠశాలల్లో టాయిలెట్స్, అంగన్వాడీ భవనాల నిర్మాణాలు, గ్రామ పంచాయతీ భవన్ నిర్మాణాలు అన్ని ఉపాధి హామీ పథకం నిధులే ఆధారమన్నారు.ఉపాధి హామీ పథకం దేశ ప్రజల గుండెల్లో నిలిచిపోయిందని, గతంలో 100 రోజులు పని దినాలు కల్పించారని,ప్రస్తుతం 125 దినాలు గా పెంచటంపై హర్షం వ్యక్తం చేస్తున్నా మన్నారు.గతంలో వ్యవసాయ రంగానికి కూడా ఉపాధి హామీ అనుసంధానం చేయాలని, ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుబంధం చేయడంతో కూలీలకు పని లభించడంతో పాటు, రైతులకు మేలు జరుగుతుందన్నారు. వ్యవసాయానికి అనుసంధానం చేసి ఉపాధి హామీ పథకానికి మార్పులు చేసి, అమలు చేయాలని, దేశ స్వాతంత్ర్యం కోసం మార్గదర్శనం చేసిన మహోన్నతుడు మహాత్మ గాంధీ అని, ఉపాధి హామీ పథకానికి మహాత్మ గాంధీ పేరు మార్చాలనే ప్రతిపాదన సరికాదన్నారు. కేంద్రం గతంలో ఉపాధి హామీ పథకానికి 100 శాతం నిధులు కేటాయించిందని, ప్రస్తుతం కేంద్రం 60శాతం,రాష్ట్రం 40 శాతం కేటాయించాలని ప్రతిపాదించడంతో రాష్ట్రాల పై భారం పెరిగి, నిధుల కొరత ఉపాధి హామీ పథకం అమలుకు ఆటంకంగా మరే ప్రమాదం ఉందన్నారు. యూపీఏ ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకం, రాజీవ్ గాంధీ ప్రవే శపెట్టిన ఆర్థిక సంఘం నిధులు గ్రామ పంచాయతీలకు హక్కుగా లభిస్తున్నాయని, ప్రజల గుండెల్లో ఉన్న నెహ్రూ పేరు తుడిచివేయాలని మోదీకి నెహ్రూ పై ఈర్ష్య ఉండేదని, ఇప్పుడు మహాత్మ గాంధీ పై పడ్డారని ఆరోపించారు. మహాత్మ గాంధీ పేరు తొలగించి వికసిత భారత్ గ్యారంటీ ఫర్ రోజ్ గార్ అజీవక మిషన్ గ్రామీణ గా (విబిజి రాంజీ) గా పేరు మార్చాలన్నే ప్రతిపాదన దారుణమన్నారు. కలియుగంలో శ్రీరాముడు ప్రజలందరికీ ఆరాధ్య దైవమని, మహాత్మ గాంధీ తుది శ్వాస విడిచేటప్పుడు కూడా హే రామ్ అని ప్రాణాలు విడిచారని గుర్తు చేశారు. కలియుగంలో శ్రీరాముడు అంటే మహాత్మ గాంధీ అని, తాము శ్రీరాములవారి ఆరాధకులమేనన్నారు. వికసిత భారత్ రాముడి పాలన అనుసరిస్తుందని భావిస్తే వికసిత భారత్ కు వికసిత శ్రీరామ్ అని పేరు పెట్టాలని, మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం మరింత మెరుగు పర్చేందుకు కృషి చేయాలని, పేరు మార్చడంతో ప్రజలకు ఒనగూరే ప్రయోజనం ఏమి లేదన్నారు. మహాత్మ గాంధీ పేరు మార్చినా చెరిగేది కాదని, ప్రజల గుండెల్లో ఉంటుందన్నారు. ఉపాధి హామీ పథకానికి మహాత్మ గాంధీ పేరు తొలగించాలని ప్రతిపాదన ఉపసంహరించుకోవాలని, ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని జీవన్ రెడ్డి డిమాండ్ చేశారు.

# ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు



**-పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి**

**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ డిసెంబర్ 17 :** పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళి, భద్రత ఏర్పాట్లు పరిశీలించిన పెద్దపల్లి డీసీపీ.రామగుండం పోలీస్ కమీషనరేట్ పెద్దపల్లి జోన్, ఓదెల, సుల్తానాబాద్, పెద్దపల్లి, ఎలిగేడు మూడవ విడత గ్రామపంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతున్నట్లు పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి తెలిపారు. పోత్కపల్లి, మడక. ఓదెల, కొలనూరు లలో ఎన్నికలు జరుగుతున్న పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వహిస్తున్న అధికారులకు, సిబ్బందికి ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేల భద్రత పరమైన పలు సూచనలు చేశారు.మూడవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు శాంతియుత వాతావరణంలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పెట్రోలింగ్ వాహనాలు,ప్రత్యేక పోలీసు బృందాలు నిరంతరం పర్యటిస్తూ శాంతిభద్రతలను పర్యవేక్షిస్తున్నారని తెలిపారు.డీసీపీ వెంట గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, పోత్కపల్లి ఎస్ ఐ దీకొండ రమేష్, తదితరులు ఉన్నారు.

# ధర్మపురి మండల సర్పంచులు వీరే....













**చురకలు విలేకరి, ధర్మపురి, డిసెంబర్ 17 :** జగిత్యాల జిల్లా ధర్మపురి మండలంలోని గ్రామాల్లో బుధవారం గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మండలం లో 73.05 శాతం పోలింగ్ నమోదైంది. కాగా మండలంలోని ఆక్సయిపల్లి సర్పంచ్‌గా ఎదుల మహేష్ (కాంగ్రెస్), దుబ్బల గూడెం సర్పంచ్ గా దత్తూరి రమ (బీఆర్ఎస్), గాదపెల్లి సర్పంచ్ గా అల్పట్ల సురేష్ (బిఆర్ఎస్), నాగారం సర్పంచ్ గా చిలుముల లక్ష్మణ్ (కాంగ్రెస్), కొసునూరుపల్లె సర్పంచ్ గా ఎన్నం రమాదేవి (బిఆర్ఎస్), దమ్మన్న పేట సర్పంచ్ గా దండవేణి సత్తవ్వ (బిఆర్ఎస్), బూరుగుపల్లె సర్పంచ్ గా గుర్రం రేఖ (కాంగ్రెస్), బుద్దేష్ పల్లె సర్పంచ్ గా రేణు బుచ్చవ్వ (స్వతంత్ర), తీగల ధర్మారం సర్పంచ్ గా పందిరి అశోక్ (కాంగ్రెస్),కమలాపూర్ సర్పంచ్ గా కుమ్మరి తిరుపతి (బీజేపీ), తిమ్మాపూర్ సర్పంచ్‌గా నల్మాస్ పుష్పలత (బీజేపీ),నేరెళ్ల సర్పంచ్‌గా కాసారపు బాలగౌడ్ (కాంగ్రెస్), రాయపట్నం సర్పంచ్‌గా రాందేని మొగిలి (కాంగ్రెస్), తుమ్మెనాల సర్పంచ్ గా తౌటు జగదీష్ (కాంగ్రెస్),రాజారం సర్పంచ్ గా జిల్లా బుచ్చన్న (కాంగ్రెస్),జైన సర్పంచ్‌గా గడ్డి లక్ష్మి (కాంగ్రెస్),దొంతపూర్ సర్పంచ్‌గా సుద్దాల స్వరూప (బీఆర్ఎస్), రామయ్య పల్లె సర్పంచ్ గా కనుకుంట్ల రవీందర్ రెడ్డి (బీఆర్ఎస్), మగ్గిడి సర్పంచ్ గా ఎడపల్లి పత్తి లత (బీఆర్ఎస్), గోవిందపల్లె సర్పంచ్ గా రాజారపు లలిత (కాంగ్రెస్), ఆరెపల్లి సర్పంచ్ గా గుగ్గిళ్ళ మధుకర్ (స్వతంత) లు గెలుపొందారు. అంతకు ముందు మూడు గ్రామ పంచాయతీలు ఏకగ్రీవంగా కాగా, నర్సయ్య పల్లె పోతంశెట్టి నరసయ్య, దోనూర్ దాసరి పురుషోత్తం, బీఎన్ని గూడెం గోపు రాజన్నలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గెలుపొందిన వారికి రిటర్నింగ్ అధికారులు నియమాక పత్రాలు అందజేశారు. గ్రామాలలో విజయోత్సవ ర్యాలీలు జరిగాయి.

# కాంగ్రెస్ నేత సమద్ నవాబ్ సేవలు చిరస్మరణీయం

**-నాకా చౌరస్తాలో ఒక రోడ్డుకు సమద్ నవాబ్ మార్గ్ గా నామకరణం చేస్తాం**
**-సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి,ఎంఐఎం నగర అధ్యక్షుడు గులాం అహ్మద్ హుస్సేన్..జెఎసి జిల్లా అధ్యక్షుడు అబూ బకర్ ఖాలీద్**




**చురకలు ప్రతినిధి,కరీంనగర్ డిసెంబర్ 17 :** కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, కరీంనగర్ వక్ఫ్ ప్రొటెక్షన్ కమిటీ వ్యవస్థాపక కార్యదర్శి, ఇదారా ఎ ఖాదీమానే మిల్లత్ వ్యవస్థాపకుడు అబ్దుల్ సమద్ నవాబ్ సేవలు నేటితరానికి చిరస్మరణీయంగా మిగిలిపోతాయని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, ఎమ్ఐఎం పార్టీ కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ ముస్లిం జేఏసీ జిల్లా అధ్యక్షుడు షేక్ అబుబకర్ ఖాలీద్ అన్నారు. సమద్ నవాబ్ ఇటీవలే హఠాన్మరణం చెందగా ఆయన సంతాప సభ బుధవారం కరీంనగర్ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్లో ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడు అబూ బకర్ ఖాలీద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ..నీతి, నిజాయితీ, నిబద్ధత కలిగిన నాయకుడు నవాబ్ అని ఆయన మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు అన్నారు. క్రమశిక్షణతో తన చివరి శ్వాస వరకు కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం సమద్ నవాబ్ అలుపెరుగని కృషి పోరాటం చేశారన్నారు. ఈ తరం కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు సమద్ నవాబ్ ఆదర్శమని ఆయన మరణం తనను కలిసివేసిందన్నారు. గులాం అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ పోరాట పటిమ, పట్టుదల కలిగిన నాయకుడిని ముస్లిం సమాజం కోల్పోయిందని ఆయన కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. భవిష్యత్తులో సేవలకు గుర్తింపుగా ఆయన కుటుంబానికి కుమారులకు ఎల్లప్పుడూ ముస్లిం జెఎసి అండగా ఉంటుందన్నారు. సమద్ నవాబ్ ఆశయ సాధనకు కృషి చేయాలని ఆయన కుమారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్, ముస్లిం జేఏసీ నాయకులు ఫసియుద్దీన్ నవాబ్, ముఫ్తి ఖియాస్ మొహియుద్దీన్, జమీల్, మునీబుద్ధిన్, మౌలానా అలీముద్దీన్ నిజామి, ఖైరోద్దీన్, సమద్ నవాబ్ కుమారులు, కుటుంబ సభ్యులు, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

